
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

బుధవారం 12 మార్చి 2025





వేగంగా..

గ్రామాల్లో వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే

ఎన్టీఆర్ జిల్లాలో 11,88,000 మంది, కృష్ణాజిల్లాలో 9,03,730 మందికి ఉపాధే లక్ష్యం

- ఐటీ, ఐటీ అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాల కల్పన
- ఎన్టీఆర్‌లో 31 శాతం, కృష్ణాలో 28 శాతం సర్వే పూర్తి
- పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమం

గ్రామాల్లో పేదరికాన్ని రూపుమాపటం, కుటుంబాల ఆదాయం గణనీయంగా పెంచేందుకు కూటమి ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇంటి దగ్గరే పని కల్పించటం కోసం ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో వర్క్ ఫ్రమ్ హోమ్ (డబ్ల్యూఎఫ్‌హెచ్) సర్వే చేపట్టింది. ప్రతి కుటుంబంలోని సభ్యుల విద్యార్హతలు, వాటి ఆధారంగా వారు చేయగలిగే పనుల గురించి వివరాలు సేకరిస్తోంది. ఇంటి దగ్గరే ఐటీ, ఐటీ యేతర పనులు చేసుకుంటూ ఆదాయాన్ని ఆర్జించేందుకు వీలుగా ఈ సర్వేను జరిపిస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో వర్క్ ఫ్రమ్ హోమ్ (డబ్ల్యూఎఫ్‌హెచ్) సర్వే చురుగ్గా సాగుతోంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మ్యాపింగ్ జరిగిన ప్రతి కుటుంబానికి ఫోన్లు చేసి వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే చేస్తున్నారు. వివరాలను అప్పటికప్పుడే ప్రభుత్వం ఇచ్చిన సాఫ్ట్‌వేర్‌లో రిజిస్టర్ చేస్తున్నారు. ఆధార్ ఆధారిత ఫోన్ నంబర్లకు వచ్చిన ఓటీపీ ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభిసున్నారు. విద్యావంతులు, నిరక్ష్యరాస్యులు అనే రెండు కేటగిరీలుగా ఈ సర్వేను చేస్తున్నారు. విద్యావంతుల సర్వేలో ప్రస్తుతం మీరు పనిచేస్తున్నారా? ఐటీ, ఐటీయేతర సాఫ్ట్‌వేర్ ఆధారిత పనులు చేయటానికి మీకు ఆసక్తి ఉందా? దీనికి సంబంధించి శిక్షణ తీసుకోవటం మీకు ఇష్టమేనా ? మీకు వర్క్ ఫ్రం హోమ్ చేసుకోవటానికి ఆసక్తి ఉందా ? మీ ఇంట్లో బ్రాడ్ బ్యాండ్ సదుపాయం ఉందా? ఉంటే దాని స్పీడ్ ఎంత ఉంది ? ఇంటి వద్దనే పని చేయటం కోసం తగిన స్పేస్ ఉందా? రూమ్ (గది) ఏరియా ఎంత? ఆ గదిని ఎంత మంది వినియోగించుకోవటానికి అవకాశం ఉంటుంది ? వంటి వివరాలను సేకరిస్తున్నారు.

లక్ష్యానికి అనుగుణంగా..

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 5,30,000 కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాల్లో కనీసం 11,88,000 మందికి వర్క్‌ఫ్రమ్ హోమ్ కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. దీనికి అనుగుణంగా ఇప్పటి వరకు 3,68,800 మందికి సంబంధించి వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే నిర్వహించారు. నిర్దేశించుకున్న లక్ష్యంలో ఎన్టీఆర్ జిల్లాలో 31శాతం మిగతా 6లో..

సాగు సాయం

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

1,650 మంది రైతులకు రూ.2.62 కోట్లు కేటాయింపు

26వ తేదీలోపు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తుకు అవకాశం

గత వైసీపీ ప్రభుత్వంలో వీటి ఊసేలేదు - కూటమి ప్రభుత్వం రాకతో రైతులకు పెద్దపీట

రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వ్యవసాయానికి అవసరమైన యంత్ర పరికరాలను సబ్సిడీపై ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. రైతులకు ఎటువంటి పరికరాలు అవసరమో వ్యవసాయశాఖ అధికారులు గుర్తించి ఐదు నెలల క్రితం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ ప్రతిపాదనల మేరకు 1,650 మంది రైతులకు రూ.2.62 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. గత వైసీపీ ప్రభుత్వంలో యంత్ర పరికరాలు అందక ఇబ్బంది పడిన రైతులు కూటమి ప్రభుత్వం చర్యలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 26వ తేదీలోపు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమయ్యారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలో 1.65 లక్షల హెక్టార్లలో వరి, 30 వేల హెక్టార్లలో ఉద్యానపంటలు సాగవుతున్నాయి. వ్యవసాయంలో ఉపయోగించే పరికరాలు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులను ఎదుర్కొం టున్నారు. పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ పనిముట్లు తదితర చిన్నపాటి పరికరాలను సైతం గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఇవ్వకపోవడంతో రైతులు పూర్తిస్థాయిలో ధర చెల్లించి కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే రైతుల సమస్యలపై దృష్టి సారించింది. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. జిల్లాకు బ్యాటరీ స్ప్రేయర్లు 450 కేటాయించగా, ఒక్కో పరికరానికి రూ.1000 సబ్సిడీ, అలాగే తైవాన్ స్ప్రేయర్లు 450 కేటాయించగా, రూ.36 లక్షలను సబ్సిడీగా ఇవ్వనుంది. 690 ట్రాక్టర్ పనిముట్లకు రూ.1.92 కోట్లను సబ్సిడీగా కేటాయించింది. 25 రోటోవేటర్లకు రూ.11.50 లక్షలను సబ్సిడీగా ఇవ్వనుంది. 15 పవర్ రీడర్‌లకు రూ.5.25 లక్షలను సబ్సిడీగా కేటాయించింది. 10 బ్రష్‌కట్టర్‌లకు రూ.3.60 లక్షలను సబ్సిడీగా ఇవ్వనుంది.



ఈ నెల 26 లోపు దరఖాస్తు చేసుకోవాలి

జిల్లాలోని రైతులు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు కావాలనుకుంటే ఈ నెల 26వ తేదీలోగా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఐదు ఎకరాల్లోపు వ్యవసాయ భూమిని సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులు, సన్న, చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. గతంలో ఈ-క్రాప్‌లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నట్టుగా నమోదై ఉన్న రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందిస్తారు. రైతులు పరికరాల కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో సంబంధిత పరికరాలకు ధరను బట్టి సబ్సిడీ పోను మిగిలిన సొమ్మును రైతుల వాటాగా చెల్లించాల్సి ఉంది. ఒక రైతుకు ఒక పరికరం మాత్రమే సబ్సిడీపై ఇస్తారు. గతంలో రైతులు వ్యవసాయ యంత్రాలు, పరికరాల కోసం మొత్తం సొమ్మును చెల్లించాలనే నిబంధన పెట్టారు. పరికరాలు ఇచ్చాక సబ్సిడీగా వచ్చే మొత్తాన్ని మిగతా 6లో..

వాహ్.. గుల్లలమోద



20 కిలోమీటర్లు పడవ ప్రయాణం

- పచ్చని తివాచీలా మడ అడవుల కనువిందు
- బ్రిటీష్ కాలం నాటి లైట్ హౌస్
- పర్యాటకాభివృద్ధికి అవకాశం

8లో

జలక్రీడల శిక్షణా కేంద్రానికి మంచి రోజులు

- భవన నిర్మాణ పనులు ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే

6లో

కళాశాల స్థలాన్ని రక్షించుకుంటాం

- ఎస్ఆర్ఆర్ పూర్వ విద్యార్థులు

8లో

వైద్య విద్యార్థులు క్రీడల్లో రాణించటం అభినందనీయం

- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ నరసింహం
- ముగిసిన హెల్త్ యూనివర్సిటీ క్రీడా పోటీలు

8లో

హలీంకు.. సలాం!

- పంజాసెంటర్‌లో రంజాన్ ఘుమఘుమలు
- భారీగా తయారీ సెంటర్లు.. ఇరానీ హలీంకు డిమాండ్
- క్యూ కడుతున్న జనం

6లో

రంజాన్ వేళలు



ఇఫ్తార్ (సాయంత్రం): 6-21(బుధ)
సహర్ (ఉదయం) : 04-58 (గురు)

96 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

6లో

పీ4తో పేదరికం లేని సమాజం

8లో

కేబుల్ వ్యర్థం

గుణదల-నున్న 220 కేవీ విద్యుత్ లైన్ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం

- ఖరీదైన కేబుల్‌ను అడ్డగోలుగా కట్ చేస్తున్న కాంట్రాక్టు సంస్థ
- ముక్కలై పనికిరాకుండా పోతున్న కేబుల్ వైర్లు
- ట్రాన్స్‌కో అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వానికి తీరని నష్టం



ట్రాక్టర్‌పై తరలిస్తున్న కేబుల్ ముక్కలు

గుణదల నుంచి నున్న వెళ్లే మార్గంలో జరుగుతున్న 220 కేవీ విద్యుత్ లైన్ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. మీటరు రూ.18 వేలు ఖరీదు చేసే కేబుల్‌ను కాంట్రాక్టు సంస్థ కొలతలు లేకుండా ఇష్టారాజ్యంగా కట్ చేయడంతో ఆ కేబుల్ ముక్కలు ముక్కలై ఎందుకుపనికిరాకుండా పోతోంది. ట్రాన్స్‌కో అధికారుల పర్యవేక్షణలోపంతో ప్రభుత్వానికి భారీగా నష్టం ఏర్పడుతోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నగరంలో గుణదల నుంచి నున్న మార్గంలో 220 కేవీ విద్యుత్ లైన్‌ను వేస్తున్నారు. ఇది అత్యంత శక్తివంతమైన లైన్ కావడంతో ఎక్స్ఎల్‌పీఈ కేబుల్‌ను ఉపయోగిస్తారు. ఈ కేబుల్ లోపల రాగి ఉంటుంది. ఈ కేబుల్ ధర మీటరు రూ.18 వేలు. కిలోమీటరుకు రూ.1.80 కోట్లు చొప్పున ఖర్చుపెట్టి ట్రాన్స్‌కో అధికారులు ఈ కేబుల్‌ను కొనుగోలు చేస్తున్నారు. ట్రాన్స్‌కో కొనుగోలు చేసిన ఖరీదైన కేబుల్‌ను వేసే పనుల నిమిత్తం ఓ కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. సదరు సంస్థ ఈ కేబుల్‌ను ఇష్టానుసారంగా ఉపయోగిస్తోంది. ఖరీదైన కేబుల్‌ను కట్ చేసే మిగతా 6లో..

నిలువు దోపిడీ!

ఇంద్రకీలాద్రిపై నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు

దుర్గమ్మను దర్శించుకునేందుకు దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తులను అక్కడి దుకాణాల వ్యాపారులు నిలువుదోపిడీ చేస్తున్నారు. కొండపైన, దిగువున అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా షాపులు ఏర్పాటు చేసుకుని రంగునీళ్ల సోడా రూ.35, వాటర్ బాటిల్ రూ.30 అంటూ భక్తుల జేబులను ఖాళీ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ వ్యవహారంపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- కొండపైన, దిగువున అధిక ధరలకు విక్రయాలు
- ఇష్టారాజ్యంగా షాపుల ఏర్పాటు
- రంగునీళ్ల సోడా రూ.35.. వాటర్ బాటిల్ రూ.30
- పూజా సామగ్రి సెట్టు అంటూ భక్తుల జేబులు ఖాళీ
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ఇంద్రకీలాద్రి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి కొండపైన, దిగువున వ్యాపారులు కొన్ని రకాల వస్తువులు విక్రయించేందుకు దేవస్థానం నుంచి అనుమతి తీసుకున్నారు. వారు తమ దుకాణాలను ఎనిమిది అడుగుల పొడవు, ఎనిమిది అడుగుల వెడల్పు విస్తీర్ణంలో ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. కానీ కొండ దిగువున కొందరు వ్యాపారులు 13 అడుగుల వెడల్పు, 16 అడుగుల పొడవుతో ఇష్టారాజ్యంగా షాపులను ఏర్పాటు చేశారు. ఒకవైపు మాత్రమే వ్యాపారం చేసుకోవాల్సి ఉంటే రెండు వైపులా విక్రయాలు చేస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. షాపుల కేటాయింపులో కూడా నిబంధనలు పాటించటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.



కొండపై అనధికారికంగా కొబ్బరికాయల విక్రయం

అధిక ధరలు వసూలు

కొండపైన, దిగువున కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిళ్ల దుకాణాల నిర్వాహకులు నిబంధనలకు నీళ్ల వదులుతున్నారు. వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్‌కే అధికారుల నుంచి అనుమతి తీసుకుని పూజా సామగ్రి, టెంకాయ, చేతి తాడు, ఇతర పానీయాలను మిగతా 6లో..

హలీంకు.. సలాం!

రంజాన్ మాసం అంటే భోజన ప్రియులకు ముందుగా గుర్తుకు వచ్చేది హలీం.. హలీం కోసం చాలామంది సంవత్సరం పాటు ఎదురుచూస్తారంటే అతిశయోక్తి కాదు. హలీం రుచులను ముస్లిం సోదరులే కాకుండా ఇప్పుడు అందరూ ఆస్వాదిస్తున్నారు. దీంతో హలీంకు మంచి డిమాండ్ వచ్చింది. పంజా సెంటర్ హలీంకు పెట్టింది పేరు. రంజాన్ మాసంలో ఇక్కడ రకరకాల హలీంలను పెద్ద ఎత్తున తయారుచేస్తున్నారు. ఇరానీ హలీంకు విపరీతమైన డిమాండ్ ఉందని షాపుల యజమానులు పేర్కొంటున్నారు. ఫ్యామిలీ ప్యాక్‌కు మంచి క్రేజు ఉంది. ముస్లిం సోదరులే కాకుండా ముస్లిమేతరులూ రంజాన్ స్పెషల్ ఇరానీ హలీం కోసం క్యూ కడుతున్నారు. పంజా సెంటర్‌లో హలీం తయారీపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..





» పంజాసెంటర్‌లో రంజాన్ ఘుమఘుమలు
» భారీగా తయారీ సెంటర్లు.. ఇరానీ హలీంకు డిమాండ్ » క్యూ కడుతున్న జనం

(ఆంధ్రజ్యోతి-వన్‌టౌన్)

రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు ఉదయం నుంచి ఉపవాసం ఉండి సాయంత్రం ఆహారం స్వీకరిస్తారు. రంజాన్ మాసంలో ఉపవాసానికి ఓ ప్రత్యేకత ఉంది. వేకువజామునే ఆహారం తీసుకుంటారు. తిరిగి సాయంత్రం ఆహారం తీసుకుంటారు. మధ్యలో ఎలాంటి పానీయాలు, ఘనపదార్థాలు తీసుకోరు. ముస్లిం సోదరులు ఉపవాస దీక్షను కఠినంగా ఆచరిస్తారు. రంజాన్ మాసంలో అత్యంత ప్రీతికరమైన వంటకం హలీం. ముస్లిం సోదరులు ఎక్కువగా నివశించే విజయవాడ పంజా సెంటర్‌లో కొన్నేళ్లుగా హలీం స్టాళ్లకు ఓ ప్రత్యేకత సంతరించుకుంది. హలీం తయారీలో నిపుణులచే వారిని తెప్పించి ఇక్కడ వండిస్తారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు హలీం తినకుండా ఉండరంటే అతిశయోక్తి కాదు. పంజాసెంటర్, పరిసర ప్రాంతాల్లో హలీంతో పాటు మాంసాహార వంటకాల ఘుమఘుమలతో స్టాళ్లు కిక్కిరిసిపోతాయి.

హలీం తయారీలో ముఖ్యంగా మసాలా దినుసులను సమపాళ్లలో దట్టించటం ప్రత్యేకతగా చెబుతారు. హలీంను విభిన్న రుచుల్లో తయారుచేస్తారు. ఇరానీ హలీం తయారీలో చికెన్ 65, బాయిల్డ్ ఎగ్, జీడిపప్పు, విభిన్న రుచులు గల క్రీములు వాడతారు. స్వచ్ఛమైన నెయ్యిని దానికి అదనంగా చేర్చడంతో అత్యంత రుచికరంగా ఉంటుంది. రంజాన్ నెలరోజుల పాటు ఇక్కడ స్టాళ్లను విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరిస్తారు. అల్లా ప్రార్థనలతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం సంతరించుకుంటుంది. ముస్లిం సోదరులు ఒకరిని ఒకరు పలకరించుకుంటూ ఆప్యాయతలను పంచుకుంటూ స్నేహితులు, బంధువులతో కలిసి హలీంను తినటానికి ఇష్టపడతారు. రంజాన్ మాసం ఇఫ్తార్ సమయాన్ని సాయంత్రం పాటిస్తారు. మటన్ రేట్లు ఎక్కువగా ఉండటంతో గత ఏడాది కంటే ఇప్పుడు హలీం ధరలు అధికంగా ఉన్నాయని చెబుతున్నారు. మటన్ హలీం ప్లేటు రూ.180 నుంచి రూ.350 వరకు, ఫ్యామిలీ ప్యాక్ రూ.600ల నుంచి రూ.899 వరకు, చికెన్ హలీం ప్లేటు రూ.120 నుంచి రూ.200 వరకు, ఫ్యామిలీ ప్యాక్ రూ.350 నుంచి రూ.699 వరకు ధరలు ఉన్నాయి. విజయవాడలో మామూలు రోజుల్లో కూడా హలీం లభించినా.. రంజాన్ మాసంలో ప్రత్యేకంగా ఆయా సెంటర్లలో విక్రయిస్తుంటారు.

20 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నాం

- తాజుద్దీన్, సలీం హలీం స్టాల్ ఓనర్



ఏటా రంజాన్ మాసంలో పంజాసెంటర్ వద్ద హలీం స్టాల్ ఏర్పాటు చేస్తాం. ఇక్కడ వ్యాపారం బాగానే ఉంది. నాణ్యమైన పదార్థాలు వినియోగించటం, రుచికరంగా ఉండటంతో కస్టమర్లు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాము.

నాణ్యతలో రాజీ ఉండదు

- జహెద్ షావోస్ హలీం స్టాల్ ఓనర్



పవిత్ర రంజాన్ మాసంలో తయారు చేసే హలీంలో ఎక్కడా రాజీపడకుండా నాణ్యమైన ఆహార పదార్థాలను వినియోగిస్తున్నాం. అన్ని వర్గాల ప్రజలకు ధరలు అందుబాటులో ఉన్నాయి. హలీం తినేందుకు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వస్తున్నారు.

రంజాన్ నెలరోజులూ హలీం తింటా..

- రబ్బానీ



రంజాన్ మాసంలో ప్రతిరోజూ స్నేహితులతో కలిసి హలీం తినేందుకు ఇక్కడకు వస్తాం. స్టాల్స్ యజమానులు కూడా నాణ్యమైన పదార్థాలను వినియోగించటంతో పాటు మంచి రుచికరంగా హలీం తయారు చేస్తున్నారు. హలీం తినడం వల్ల మంచి ఆరోగ్యం.. శక్తి నిస్తుంది.



వ్యాపారాలు బాగున్నాయి



ఈ ఏడాది పంజా సెంటర్‌లో హలీం వ్యాపారాలు బాగున్నాయి. హలీం ప్రియులు పెద్ద ఎత్తున తినేందుకు వస్తున్నారు. ఇక్కడ తినేందుకు హలీం ప్రియులు ఆసక్తి చూపిస్తుండటంతో పంజా సెంటర్ జనంతో కిటకిటలాడుతోంది.



వ్యక్తి ప్రయోజనాలు కంటే పార్టీ, రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

» నాడు-నేడు ఇదే నా సిద్ధాంతం
» ఎమ్మెల్సీ పదవి దక్కకపోవటంపై నెట్టెం వ్యాఖ్యలు



జగ్గయ్యపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలు, రాష్ట్రప్రయోజనాలే తనకు ముఖ్యమని 40 ఏళ్ల రాజకీయ జీవితంలో నాడు-నేడు తాను నమ్మిన, ఆచరించిన సిద్ధాంతమని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత నెట్టెం రఘురాం మంగళవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ పదవి రానందుకు అసంతృప్తిగా ఉన్నారా అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఎమ్మెల్సీ నోటిఫికేషన్ అనంతరం అధినేత చంద్రబాబును కలిసి ఖాళీ అయిన స్థానాల్లో అవకాశం కల్పించాలని కోరానని, అప్పుడే ఆయన కూటమి సమీకరణాల్లో పార్టీకి రెండే వస్తాయని, భవిష్యత్‌లో చూస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. పార్టీ, రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్టు చెప్పారు. 40 ఏళ్ల రాజకీయ జీవితం తెలుగుదేశంతోనే ప్రారంభమైందని, ఎన్నో సందర్భాల్లో పదవుల విషయంపై ఇదే సిద్ధాంతాన్ని తాను నమ్మినట్టు చెప్పారు.

జగన్ ఇంటి ముందే ఫీజు పోరు చేపట్టాలి

» వైసీపీ శ్రేణులకు నెట్టెం సలహా

గత ఐదేళ్ల పాలనలో జగన్ విద్యావ్యవస్థను నాశనం చేశారని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు విద్యార్థులకు ఇవ్వాల్సిన అన్ని నిధులను నిలిపివేసి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలల్లో జగన్ పాపాలను, చేసిన విధ్వంసాలను సరిచేయటానికే సరిపోయిందన్నారు. జగన్ ప్రభుత్వం బకాయి పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.4200 కోట్లలో ఇప్పటికే రూ.800 కోట్లు తమ ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు. మొగుడ్ని కొట్టి మొగశాలకు ఎక్కినట్టు జగన్ తీరు ఉందని, విద్యార్థులతో గతనెలలో ఫీజు పోరుకు పిలుపు ఇస్తే పట్టించుకోలేదని, ఇప్పుడు పేరు మార్చి యువత పోరుగా నాటకం ఆడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు చిత్తశుద్ధి ఉంటే యువపోరును జగన్ ఇంటి ముందు నిర్వహించాలని, తమ నేతను నిలదీయాలని కోరారు.

పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు

» సీపీ రాజశేఖరబాబు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నందిగామ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రిక్రియేషన్ ముసుగులో పేకాట నిర్వహిస్తున్న క్లబ్‌లపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్‌వి రాజశేఖరబాబు తీవ్రంగా స్పందించారు. కమిషనరేట్ పరిధిలో పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. పేకాట క్లబ్‌లనిర్వహణపై నందిగామ డివిజన్ పోలీసులను ప్రశ్నించినట్టు తెలిసింది. నందిగామ, కంచికచర్ల పట్టణాలలో ఉన్న రిక్రియేన్ క్లబ్‌లలో సుదీర్ఘ కాలంగా పేకాట నిర్వహిస్తున్నారు. ఒక దశలో పేకాటను వ్యాపారంగా చేసుకొని నిర్వాహకులు ఇతర ప్రాంతాలకు చెందిన జూదరులను ఆహ్వానించి కోట్ల రూపాయల బెట్టింగ్‌లకు దిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరల జూదక్రీడకు తెరలేపి కంచికచర్ల క్లబ్‌లో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారుతున్నట్టు ప్రచారం సాగుతోంది. నందిగామ క్లబ్‌లోనూ రాజకీయ ప్రాబల్యం ఉన్న పలువురు పేకాట ఆడుతున్నట్టు సమాచారం. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనం స్థానికంగా సంచలనం రేకెత్తించింది. కథనానికి స్పందించిన సీపీ రాజశేఖరబాబు డివిజన్ పోలీసు అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పేకాట నిర్వహిస్తున్నట్టు నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. తక్షణమే క్లబ్‌లపై నిఘా పెట్టాలని, నిర్వాహకుల సమాచారం ఇవ్వాలని కోరినట్టు తెలిసింది. ఈమేరకు కంచికచర్ల పోలీసులు ఎట్టకేలకు క్లబ్‌లలో టేబుళ్లను ఎత్తివేయించారు. నందిగామ క్లబ్ నిర్వాహకులను పిలిపించిన సీఐ ఎన్‌వీవీఎల్ నాయుడు క్లబ్ రికార్డులను పరిశీలించారు. ఇకపై పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇదిలా ఉండగా, జిల్లాకు చెందిన ముఖ్య నేత కూడా పోలీసులతో మాట్లాడి రాజధానికి సమీపంలో ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించడం సరికాదని సూచించినట్టు తెలిసింది.

బుడమేరు బాధితులకు అందని సాయం..

» మొండితోక అరుణ్‌కుమార్



విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : బుడమేరు వరద బాధితులకు ఇప్పటి వరకూ సాయం అందలేదని శాసన మండలిలో వైసీపీ సభ్యుడు మొండితోక అరుణ్‌కుమార్ మంత్రులను ప్రశ్నించారు. మంగళవారం మండలిలో జరిగిన చర్చలో అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, వరద బాధితుల సహాయార్థం ప్రజల నుంచి ఎంత సొమ్ము వసూలైందో, ఎంత ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సాయం అందలేదని బాధితులు కంచరపాలెంలో ధర్నా చేస్తే లాఠీచార్జి చేయించాల్సిన పనేమిటని ప్రశ్నించారు. బాధితులకు ఇంకెప్పుడు పరిహారం అందిస్తారన్నారు. భవిష్యత్‌లో వరదలు రాకుండా నగరంలో నెదర్లాండ్స్ తరహా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్టు ముఖ్యమంత్రి ప్రకటించారని, ఆపరేషన్ బుడమేరు నిర్వహిస్తామని మంత్రులు ప్రకటించారని, ఆమేర పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ఆయన ప్రశ్నించారు.

జలక్రీడల శిక్షణ కేంద్రానికి మంచిరోజులు

» భవన నిర్మాణ పనులు ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే





నవలంకకు పడవలో వెళ్తున్న కలెక్టర్, మండలి బుద్ధప్రసాద్, జలక్రీడల భవనం పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

నాగాయలంక, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంకలోని కృష్ణానది ఒడ్డున ఉన్న జలక్రీడల శిక్షణా కేంద్ర నిర్మాణ పనులను మంగళవారం కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌లు శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ, జలక్రీడలకు నాగాయలంక అనువైన ప్రదేశమన్నారు. జాతీయ స్థాయి క్రీడాకారిణి నాగిడి గాయత్రిది ఈ ప్రాంతం కావటంతో భవిష్యత్తులో నాగాయలంకకు పేరు ప్రఖ్యాతులు రావాలని ఆకాంక్షించారు. భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, 2018లో జలక్రీడల భవనానికి చంద్రబాబు నిధులు మంజూరు చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. నిర్మాణ దశలో ఆగిపోయిన జలక్రీడల భవనానికి కలెక్టర్ బాలాజీ డీఎంఎఫ్ ఎటి నుంచి రూ.2 కోట్లు నిధులు కేటాయించి పనులను ప్రారంభించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎదురుమొండి-గొల్లమంద రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని, టెండర్లు పిలిచి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేత పనులను ప్రారంభిస్తామన్నారు. అనంతరం నవలంక పర్యాటక కేంద్రాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే, తహసీల్దార్ ఎం.హరనాథ్, మండవ బాలవర్ధిరావు, తలశిల స్వర్ణలత అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్‌ఈ పీవీ రమణయ్య, పలు శాఖల అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.



ఇంట్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

96 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

నాగాయలంక, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఎదురుమొండి గ్రామంలోని నాయుడు అంకాలమ్మ ఇంట్లో 96 రేషన్ బియ్యం బస్తాలను అక్రమంగా నిల్వ ఉంచినట్టు సమాచారం రావటంతో మంగళవారం మండల పీడీఎస్ డీటీ ఖాసింబాబు, రెవెన్యూ అధికారులతో కలిసి గ్రామానికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినందుకు నాయుడు అంకాలమ్మపై 6ఏ కేసు నమోదు చేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గ్రామంలోని రేషన్ డీలర్‌కు అప్పగించినట్టు డీటీ తెలిపారు.



ఆలయ ప్రాంగణంలో చకచకా వినోద ఏర్పాట్లు

తిరుపతమ్మ తిరునాళ్లకు ఏర్పాట్లు

పెనుగంచిప్రోలు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14 నుంచి 18 వరకు నిర్వహించనున్న తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాలకు దేవస్థాన సిబ్బంది విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ డిప్యూటీ కమిషనర్ బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మునేటిలో భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాలకు ఏర్పాట్లు, ఆలయానికి ఉత్తరం వైపున పలు శాఖలకు సంబంధించిన ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సాంస్కృతిక, వినోద కార్యక్రమాల నిర్వహణకు వేదికలు సిద్ధం చేశారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్.రమా ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

నిలువు దోపిడీ!

(5వ పేజీ తరువాయి)

అనధికారికంగా విక్రయిస్తున్నారు. కొండపైన కూల్ డ్రింక్స్, వాటర్ బాటిళ్ల షాపులో టెంకాయ, పసుపు, కుంకుమ, గాజులు, నిమ్మకాయలను సెట్టుగా పెట్టి రూ.100లకుపైగా వసూలు చేస్తున్నారు. ముక్క చీర రూ.100, పసుపు, కుంకుమ, ముక్క చీర, టెంకాయ కలిపి సెట్టుగా రూ.200, టెంకాయ రూ.40లకు విక్రయిస్తున్నారు. గుర్తింపు లేని వాటర్ బాటిల్ ఒక్కొక్కటి రూ.30 విక్రయించి భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. కూల్‌డ్రింక్‌పై ఎంఆర్‌పీ కంటే రూ.5 నుంచి 10 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. చేతికి కట్టుకునే తాడు రూ.50లు, కుంకుమభరణి రూ.25లు, ఇతర పూజా సామగ్రికి అధికంగా రుసుం వసూలు చేస్తున్నారు. కొండపై ఒకే ఒక షాపు ఉండటం వల్ల దుకాణంలో ఉన్న సిబ్బంది అడిగినంత డబ్బులు భక్తులు ఇవ్వాల్సి వస్తోంది. ఈ షాపు కూడా నిబంధనలకు విరుద్ధంగా దుర్గగుడిలో అవుట్ సోర్సింగ్‌లో చేసే ఓ ఉద్యోగి నిర్వహిస్తున్నట్లు సమాచారం.

యథేచ్ఛగా రంగునీళ్ల గోలీ సోడాలు

కొండ దిగువున, మహామండపం ఎదురుగా ఉన్న కూల్ డ్రింక్స్ దుకాణంలో కేవలం వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్ మాత్రమే విక్రయించాలి. అయితే అనధికారికంగా రంగునీళ్ల గోలీ సోడాలు అమ్ముతున్నారు. సోడా ధర రూ.35 నుంచి 40 వరకు, ఓ కంపెనీ బాదం పాలు ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. అధిక ధరల వసూళ్లపై పలువురు భక్తులు సంబంధిత విభాగం అధికారులకు ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. వ్యాపారస్తుల వ్యవహారంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యంగా ఆలయ ఉద్యోగుల సమాధానం

దేవస్థానంలో వ్యాపారస్తులు నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారం చేస్తున్నారని, భక్తుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారని సంబంధిత లీజు విభాగం ఏఈవో దుర్గారావు, సూపరింటెండెంట్ డి.వి.వి.సత్యనారాయణను వివరణ కోరగా, మాకేమి తెలియదు, ఈవో దృష్టికి తీసుకువెళ్లండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. నిత్యం పర్యవేక్షించాల్సిన ఉద్యోగులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం గమనార్హం.

కేబుల్ వ్యర్థం

(5వ పేజీ తరువాయి)

విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఎక్కడ అవసరమో అక్కడే కట్ చేయాలి. కానీ సదరు సంస్థ ఎడాపెడా కట్ చేయటం వల్ల ఖరీదైన కేబుల్ కాస్తా ముక్కలు ముక్కలుగా పనికిరాకుండా పోతోంది. ఈ కేబుల్స్‌ను కాంట్రాక్టు సంస్థ ట్రాక్టర్లలో వేసుకుని తరలిస్తున్న దృశ్యాలు ఇటీవల 'ఆంధ్రజ్యోతి'కి లభించాయి. దాదాపుగా రెండు డజన్లకు పైగా ట్రాక్టర్లలో తరలించారు. ఒక్కో కేబుల్ ముక్క ఐదు మీటర్ల వరకు ఉంది. ఒక్కో ముక్క ఖరీదు రూ.90 వేలు. ఈ ముక్కల విలువ రూ.25 లక్షల వరకు ఉంటుంది. ఇలాంటి ముక్కలను ఎన్ని ట్రిప్పుల్లో తరలించారో ఊహిస్తే భారీగానే ప్రభుత్వానికి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఇంత చిన్న కేబుల్స్‌ను మళ్లీ ఉపయోగించటానికి పనికిరావు. ఈ ముక్కలు స్క్రాప్ కింద పోతాయి. అక్కడ కేబుల్ ముక్క రూ.2 వేల ధర మాత్రమే పలుకుతుంది. ఎంతో విలువైన కేబుల్‌ను సరైన కొలత ప్రకారం కట్ చేసి ఉంటే ఇంత భారీ నష్టం జరగటానికి అవకాశం ఉండదు. కేబుల్ మనం కొన్నది కాదు కదా అని ఇష్టానుసారంగా కట్ చేయటం వల్ల తలెత్తిన నష్టం ఇది. ట్రాన్స్‌కో అధికారుల పర్యవేక్షణ లేకపోవటం వల్ల జరుగుతున్న ఆగం ఇది. రేపు అమరావతిలో చేపట్టే పనులలో కూడా ఇలాగే నిర్లక్ష్యంగా ఉంటే ప్రభుత్వంపై కోట్లాది రూపాయల భారం పడే అవకాశాలు ఉన్నాయి. ట్రాన్స్‌కో అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి క్షేత్ర స్థాయిలో పనులను పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

సాగు సాయం

(5వ పేజీ తరువాయి)

రైతుల ఖాతాల్లో జమచేస్తామని వైసీపీ ప్రభుత్వ హయాంలో మెలికపెట్టారు. నాడు పెద్ద యంత్రాలు మాత్రమే ఇచ్చి వాటిని అద్దెకు తిప్పాలని చెప్పారు. సబ్సిడీపై యంత్రాలు పొందాలంటే ఐదారుగురు సభ్యులతో కూడిన రైతు గ్రూపులు సకాలంలో మొత్తం నగదు చెల్లించలేక ఇబ్బందులు పడిన దాఖలాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రైతులకు వ్యక్తిగతంగా చిన్నపాటి వ్యవసాయ పరికరాలను అందించేందుకు అవకాశం కల్పించడంతో చిన్నపాటి పరికరాలు రైతులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఇచ్చే పరికరాలు 2024-25 సంవత్సరానికి సంబంధించినవని, 2025-26 ఆర్థిక సంవత్సరంలో మరిన్ని పరికరాలు రైతులకు అందిస్తామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

అమరావతి రైతులకు సత్వర న్యాయం జరగాలి

» ఎమ్మెల్యే సుజనా చౌదరి



వన్‌టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగాలని, ఆ బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు అమరావతి నిర్మాణ పనులు పరుగులు తీశాయని, అనంతరం వైసీపీ అరాచక పాలనతో విధ్వంసం జరిగిందన్నారు. మూడు రాజధానులను తెరపైకి తెచ్చి అమరావతిని విచ్ఛినం చేసి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. మూడు పంటలు పండే 33వేల ఎకరాల భూములను చంద్రబాబు మాటలు నమ్మి రైతులు ఇచ్చారన్నారు. వారిని జగన్ ప్రభుత్వం తీవ్ర వేధింపులకు గురిచేసిందని పేర్కొన్నారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్రం ప్రకటన చేసినా కూడా వైసీపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిందన్నారు. అమరావతిని భవిష్యత్తులో ఎవరూ కదిలించలేని విధంగా చట్టం తీసుకురావాలన్నారు. ఇప్పటి వరకు రైతులకు జరిగిన నష్టాన్ని ఏవిధంగా భర్తీ చేస్తారో కూడా చెప్పాలని సుజనా కోరారు. దీనిపై మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ బదులిస్తూ రాబోయే మూడేళ్లలో రాజధాని నిర్మాణ పనులను ప్రపంచ బ్యాంక్, ఏడీబీతో పాటు హడ్కో, ఇతర అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సహాయంతో దాదాపు 64వేల కోట్ల రూపాయల అంచనాలతో పూర్తి చేస్తామన్నారు. రోడ్లు, అధికారులు, ప్రజా ప్రతినిధుల భవన సముదాయలు, ఇతర మౌలిక సదుపాయాలను దశల వారీగా పూర్తి చేస్తామని వివరించారు. రాజధాని అంశంలో దాష్టీకాలు, దారుణాలకు పాల్పడ్డ వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. అమరావతి రాజధాని అంశంపై సుదీర్ఘ చర్చ అవసరమన్నారు. ఈ అంశం పై సమయం చూసి ఈ సమావేశాల్లోనే చర్చ పెడతామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు.



అకాడమి ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థి భాస్కరమూర్తి

సిద్ధార్థ ల్యాబ్‌కు రూ.20 లక్షల విరాళం

» అందజేసిన పొట్లూరి భాస్కరమూర్తి

బెంజిసర్కిల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సిద్ధార్థ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్(సాహీ)లోని ల్యాబొరేటరీలో పరిశోధన సౌకర్యాల కల్పనకు పూర్వ విద్యార్థి, సోనోవిజన్ అధినేత పొట్లూరి భాస్కరమూర్తి రూ.20 లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. సిద్ధార్థ అకాడమిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో భాస్కరమూర్తి చెక్కును అందజేశారు. ఆయన 1983 బ్యాచ్‌లో బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో పూర్వ విద్యార్థి. అకాడమిలోని ప్రయోగశాలకు పొట్లూరి తండ్రి పీజే మూర్తి పేరు పెట్టనున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమి ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ, ల్యాబొరేటరీకి విరాళం ఇచ్చిన భాస్కరమూర్తిని అభినందించారు. కార్యక్రమంలో హయ్యర్ ఎడ్యుకేషన్ చాన్సలర్ కేవీ చౌదరి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు, వీసీ ప్రొఫెసర్ ఏవీ రత్నప్రసాద్, డైరెక్టర్ ప్రొఫెసర్ పీబీ పాండురంగారావు, వీఆర్ఎస్ఎస్ఈ డీన్ ప్రొఫెసర్ డి.వెంకటరావుతోపాటు రిజిస్ట్రార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన భాస్కరమూర్తిని అభినందించారు.

వేగంగా..

(5వ పేజీ తరువాయి)

పూర్తయింది. కృష్ణాజిల్లాలో 4,14,000 కుటుంబాలు ఉండగా.. మొత్తం 9,03,730 మందికి వర్క్ ఫ్రం హోమ్ కల్పించాలన్నది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంగా ఉంది. ఇప్పటి వరకు 2,51,836 మందికి సంబంధించి వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేను పూర్తి చేశారు. కృష్ణాజిల్లాలో 28 శాతం మేర వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే పూర్తయ్యింది.

పనిచేసుకునే పద్ధతులపై ఆరా

వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఐటీ, ఐటీ అనుబంధ రంగాలకు సంబంధించిన జాబ్ వర్క్‌నే ఇస్తారు. దీని కోసం ముందస్తుగా శిక్షణ ఉంటుంది. శిక్షణ వద్దు అనుకున్న వారికి కూడా జాబ్ వర్క్ ఇవ్వటం జరుగుతుంది. ఈ జాబ్ వర్క్‌లో కూడా మూడు పద్ధతులు ఉన్నాయి. పూర్తిగా ఇంటి దగ్గరే పనిచేసుకోవచ్చు, ఒక రోజు ఆఫీసులో, మరో రోజు ఇంటి దగ్గర పనిచేసుకోవచ్చు. పూర్తిగా ఆఫీసులో కూడా పనిచేసుకోవచ్చు. వీటికి కూడా వర్క్ ఫ్రం హోమ్ డేటా ఎంట్రీలోనే వివరాలు అడుగుతున్నారు.

నెలాఖరుకు సర్వే పూర్తి!

ఈ నెలాఖరు నాటికి వర్క్ ఫ్రం హోమ్ (డబ్ల్యూఎఫ్‌హెచ్) సర్వేను పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ఈ నెల 20వ తేదీ నాటికి సర్వేను పూర్తి చేసేందుకు లక్ష్యం నిర్దేశించుకున్నారు. కృష్ణాజిల్లా కంటే ఎన్టీఆర్ జిల్లాలో సర్వే ఇంకా పురోగతిలో ఉంది. జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అభివృద్ధి అధికారిణి జ్యోతి సర్వేను పరుగులు పెట్టిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ముందుగా సర్వే జరగలేదు. రెండో దశలో ప్రారంభించాల్సి వచ్చింది. అయినప్పటికీ చాలా వేగంగానే సర్వే జరుగుతోంది.

విజయగణపతి ఆలయంలో విశేషపూజలు

ఉయ్యూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కడవకొల్లు పంచాయతీ వీరవల్లి మొఖాసాలో విజయగణపతి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకుని జరుగుతున్న పూజా కార్యక్రమంలో మంగళవారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవత పూజ నిత్య హోమం మూల మంత్ర హోమం, 108 శతకలశాభిషేకం, ఉత్సవమూరిత చర ప్రాణ ప్రతిష్ఠాపన నిర్వహించారు. అనంతరం సిద్ధి బుద్ధి సమేత విజయగణపతి కళ్యాణోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు జొన్నలగడ్డ రాంబాబు, బసవరాజేశ్వరి పూజలో పాల్గొన్నారు.



వీరవల్లి మొఖాసాలోని విజయగణపతి దేవాలయంలో మూల మంత్ర హోమం

విద్యుత్ వైర్ల దొంగల అరెస్టు

గన్నవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సావరగూడెంలో పేదలకు ఇచ్చిన కాలనీలో విద్యుత్ శాఖ కరెంట్ స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేశారు. ఆ వైర్లను గుట్టుచప్పుడు కాకుండా పట్టపగలే అపహరించుకుపోతున్నారు. ఆ దొంగలను మంగళవారం గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో 3500 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అక్కడ కరెంట్ స్తంభాలు, వైర్లు వేశారు. కేసరపల్లికి చెందిన రవి, రాంబాబు ఇద్దరు ప్రయివేటుగా కరెంటు పనులు చేస్తుంటారు. దీంతో ఆ ఇద్దరు కాలనీలోని సుమారు 800 మీటర్లు అపహరించినట్లు తెలిపారు. సుమారు రూ.30వేలు విలువ చేసే వైర్లు ఉన్నాయని చెప్పారు. విద్యుత్‌శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని వాచ్‌మన్ మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : ఆటో ఢీ కొని తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన వీరవల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరవల్లి పీహెచ్‌సీలో నైట్‌వాచ్‌మన్‌గా పనిచేస్తున్న రెడ్డి ఫకీర్(40)ను సోమవారం రాత్రి పోలీస్‌స్టేషన్ దగ్గరలో రోడ్డు దాటుతుండగా వెనుకవైపు నుంచి ఆటో వేగంగా ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, 5, 6 తరగతుల చదివే పిల్లలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఉండడమే ఈ ప్రమాదానికి కారణమని ఎస్సై తెలిపారు.

రేషన్ డిపోలపై విజిలెన్స్ అధికారుల దాడి

గన్నవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు రేషన్ డిపోలపై మంగళవారం సివిల్ సప్లై విజిలెన్స్ సీఐ ఉమర్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. కేసరపల్లి 28వ రేషన్ డిపోలో 5 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉండటాన్ని గుర్తించారు. డీలర్ శేషయ్యపై 6ఏ కేసు నమోదు చేశారు. బుద్ధవరం రోడ్డులో ఉన్న మరో రేషన్ డిపోలో తనిఖీ చేయగా 23 కట్టల బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించారు. బియ్యం బస్తాలు పంపిణీ చేసే వాహన దారుడు తీసుకు వెళ్లడంలో కొంత ఆలస్యం అవడంతో డిపోలో స్టాక్ ఎక్కువగా ఉన్నట్లు విచారణలో తేల్చారు. బియ్యాన్ని వెంటనే ప్రజలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. సివిల్ సప్లై డీటీ నండూరి ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

హనుమాన్‌జంక్షన్/ ఉంగుటూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకారం సంఘం అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణకు అర్హులైన వెనుకబడిన వర్గాల మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె. జోగేశ్వరరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ కేటగిరిలో కమ్మ,రెడ్డి,కాపు, క్షత్రియ,ఆర్యవైశ్య, బ్రాహ్మణ వర్గాల మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు గ్రామ సచివాలయాలు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

న్యాక్ సెంటర్‌లో..

ఉయ్యూరు : స్థానిక న్యాక్ సెంటర్‌లో ఈ నెల 25 నుంచి అసిస్టెంట్ సర్వేయర్, మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్టు సెంటర్ ఇన్‌చార్జ్ రవి సుధాకర్ తెలిపారు. 16నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి కనీసం 10వ తరగతి, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, ఆధార్ జిరాక్స్ స్టడీ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో న్యాక్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 9392345939, 7660968899 సెల్ నంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.

అభివృద్ధే లక్ష్యం కావాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పోరంకి సాలిపేటలో సమస్యలపై స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీ అభివృద్ధే అందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం మునిసిపాలిటీలోని పోరంకి సాలిపేటలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులు, ప్రజల మధ్య సమన్వయం ఉన్నప్పుడే మునిసిపాలిటీ అభివృద్ధి చెందుతుందన్నారు. అధికారులు తమ కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకొని వాటిని శీఘ్రమే పరిష్కరించినపుడు వారి మన్ననలను పొందగలుగుతారని పేర్కొన్నారు. సాలిపేటలో డ్రెయిన్ల పూడికతీతలు, రోడ్లపై చెత్త, కనెక్టివిటీ రోడ్ల పరిస్థితులు, వీధిదీపాలు, తాగునీటి సమస్యల గురించి స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తేగా.. వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, వివిధ శాఖల ఏఈలు, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

వందడుగుల రోడ్డును విస్తరించాలి

కానూరు ఆటోనగర్ నుంచి గతంలోనే నిర్మించిన వందడుగుల రోడ్డును తాడిగడప మీదుగా కృష్ణా కరకట్ట వరకు పొడిగించి అభివృద్ధి చేయాలని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు స్థానిక ప్రముఖులు వినతి పత్రం అందజేశారు. వందడుగుల రోడ్డును కరకట్ట వరకు పొడిగించి అభివృద్ధి చేసే పక్షంలో బందరు రోడ్డుపై ట్రాఫిక్ ఇబ్బందులు చాలావరకు తగ్గుతాయని, కృష్ణాకరకట్ట వెంబడి ఉన్న గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలోనే కానూరు మాస్టర్‌ప్లాన్‌లో అరవై అడుగుల రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారని, అయితే అరవై అడుగుల రోడ్డు స్థానే వందడుగుల రోడ్డును యథాతథంగా విస్తరించే పక్షంలో ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగు పడతాయని పేర్కొన్నారు. తాడిగడప, పెనమలూరు, పెదపులిపాక, చోడవరం గ్రామాల గుండా 60 అడుగుల రోడ్లు నిర్మించి కరకట్టకు అనుసంధానించడం వల్ల బందరు రోడ్డునుంచి కరకట్టకు కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణంలో బందరు కాల్వపై ఒక వంతెన, దివిసీమ కాల్వపై మరో వంతెన నిర్మాణాలు అవసరమవుతాయని తెలిపారు. పర్మినెంటు కట్టడాలు లేకపోవడం వల్ల వందడుగుల రోడ్డు నిర్మాణానికి స్థల సేకరణ అత్యంత సులువుగా సాధ్యమవుతుందని విన్నవించారు. వినతిపత్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సదరు విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చినవారిలో ముక్కామల రామచంద్రరావు, కిలారు గోపాలకృష్ణ, తాతినేని శ్రీనివాస్, మునునూరు శ్రీనివాస్, గుజ్జర్లపూడి బాబూరావు ఉన్నారు.

ఇళ్ల పన్ను భారాన్ని తగ్గించాలి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న జనసేన నేత చలమలశెట్టి

హనుమాన్‌జంక్షన్,మార్చి 11(ఆంధ్రజ్యోతి): బాపులపాడు పంచాయతీ గ్రామ ప్రజలపై వేసిన ఇళ్ల పన్ను భారాన్ని తగ్గించాలని జనసేన జంక్షన్ పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జనసేన నియోజకవర్గ సమన్వకర్త చలమలశెట్టి రమేశ్ బాబు నాయకత్వంలో మంగళవారం జనసేన నాయకులు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి అంజన, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షు డు వడ్డి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు వేగుంట రాము, జంక్షన్ పట్టణ జనసేన అధ్యక్షుడు అహమ్మద్, రామినేని శివరామకృష్ణ, వడ్డి శేఖర్, వీర మహిళలు సింగవరపు సూర్యవతి, జయరాణి తదితరులు పాల్గొన్నారు.

ఓగిరాలలో నిత్యావసరాల పంపిణీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : మానవతాదృక్పథంతో పేదలకు, వృద్ధులకు అవసరమైన సేవలందించేలా నిత్యావసరాలను పంపిణీ చేస్తూ నూజివీడు సీడ్స్ అండగా నిలుస్తుందని సీఈవో కొల్లిపర వెంకట్రావు అన్నారు. ఓగిరాలలోని ఓగిరాల చారిటబుల్ ట్రస్ట్ పర్యవేక్షణలో నూజివీడు సీడ్స్ సంస్థ, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సి బిలిటీ (సీఎస్సార్) కార్యక్రమంలో భాగంగా పేదలకు, వృద్ధులకు నిత్యావసరాల కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. 102 మందికి 14 రకాల నిత్యావసరాలతో కూడిన కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మేడికొండ వెంకట నరసింహనాయుడు, రామకృష్ణ, సోంబాబు, ఆలూరి శ్రీనివాస్, కొండపావులూరి కృష్ణప్రసాద్, చెరుకూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిక్ట్ జిల్లా గవర్నర్‌గా ఆంజనేయులు నామినేషన్

పెనమలూరు, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 316డీ జిల్లా గవర్నర్‌గా వైస్ గవర్నర్‌గా పనిచేస్తున్న వీవీపీఎస్ ఆంజనేయులు నామినేషన్ దాఖలు చేశారు. కానూరుకు చెందిన ఆంజనేయులు ఎంతో కాలంగా లయన్స్ క్లబ్ సభ్యులుగా సమాజ సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా విజయవాడ లయన్స్ క్లబ్ కృత్రిమ అవయవాల విభాగం కోఆర్డినేటర్ జ్యోసుల శ్రీరాంపవన్, క్లబ్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా తిరుపతమ్మ, గోపయ్యల గ్రామోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : వీరవల్లి తిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల మహోత్సవాల్లో భాగంగా మంగళవారం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలలో మంగళవాయిద్యాల మధ్య తమ ఇంటి ముంగిటకు వచ్చిన తిరుపతమ్మ, గోపయ్యస్వామికి మహిళలు వారపోసి మంగళహారతులిచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి పసుపు, కుంకుమ, వస్త్రాలను సమర్పించారు. మూడు రోజులు జరిగే గ్రామోత్సవాన్ని ధర్మకర్త నందమూరి కృష్ణప సాద్, లంక రవిశ్రీనివాస్, కలపాల రాజాబాబు, నాని, గిరిధర్ పర్యవేక్షిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శౌంరి శివరాంప్రసాద్

పెనమలూరు, మార్చి11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన స్వయం సహాయక పథకాలకు దరఖాస్తులు పెట్టి వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శౌంరి శివరాంప్రసాద్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ఏపీలో బీసీ, ఈబీసీ, ఓసీ కులాలకు సంబంధించి 2024-25 సంవత్సరానికి బీసీ కార్పొరేషన్, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాల ద్వారా సబ్సిడీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివిధ కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : తిప్పనగుంటకు చెందిన విద్యార్థిని కాలేజీకి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తిప్పనగుంటకు చెందిన విద్యార్థిని (19) ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. 8న కాలేజీకి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు చుట్టుపక్కల వారిని, స్నేహితులను అడిగి గాలించినా జాడ తెలియకపోవడంతో తండ్రి వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో 9న ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.



బీద రవిచంద్రకు మొక్కను అందజేస్తున్న జిల్లా టీడీపీ నాయకులు

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : రైతుల అభ్యున్నతికి ఎమ్మెల్సీగా బీద రవిచంద్రయాదవ్ మరింత కృషి చేయాలని జిల్లా టీడీపీ నాయకులు కోరారు. విజయ వాడలోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి సత్కరించి మొక్కను ఇచ్చి శుభాభి నందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతు కష్టాలు తెలిసిన బీద రవిచంద్ర యాదవ్ గత వైసీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు, ఉపాధి హామీ బకాయిలను ఇప్పించేలా రైతులందరితో కలిసి పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఆళ్ల గోపాలకృష్ణ, కుర్రా నరేంద్ర, కవులూరి రాజాచంద్రమౌళి, చెన్నుపాటి శ్రీధర్ పాల్గొన్నారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు



నందీశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పెనమలూరు, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం త్రయోదశి సందర్భగా ప్రదోషకాలంలో మహానందీశ్వరస్వామికి ఆలయ అర్చకులు సాగర్ ఆధ్వర్యంలో అభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధి ప్రదాత సంగా నరసింహారావు భక్తులకు ప్రసాదాలు అందించినట్లు ఆలయ ఈఓ ఎన్ భవాని తెలిపారు.

అత్యధిక ప్యాకెజీ పొందిన ఆదిత్య అందరికీ స్ఫూర్తి

పెనమలూరు, మార్చి11(ఆంధ్రజ్యోతి): అమెజాన్ సంస్థలో కొలువు సాధించి అత్యధిక ప్యాకేజీ పొందిన ఆరేపల్లి వెంకటసాయి ఆదిత్య విజయం అందరికీ స్ఫూర్తిదాయకమని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. అమెజాన్ కంపెనీలో కోటిన్నర కొలువు సాధించిన పోరంకికి చెందిన ఆదిత్య తల్లిదండ్రులను మంగళవారం ఆయన ఘనంగా సన్మానించారు. అతడిని చక్కగా తీర్చి దిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శౌంరి శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కపాడులో ప్రజా చైతన్య యాత్ర

ఉంగుటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సమస్యల పట్ల ప్రజలను చైతన్యవంతుల్ని చేసి, సదరు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయడమే ప్రజాచైతన్య యాత్ర ముఖ్య ఉద్దేశమని సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని ముక్కపాడులో సీపీఎం ఆధ్వర్యంలో నాయకుల బృందం ప్రజాచైతన్యయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గ్రామంలో నెలకొన్న సమస్యలతోపాటు, సామాజిక సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

రిలయన్స్ గోదాము మూత

- న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించిన కార్మికులు
- మద్దతు తెలిపిన సీఐటీయూ నేతలు



ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఆందోళన చేస్తున్న కార్మికులు

గన్నవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్తాబాద శివారు రామవరప్పాడు పై ఓవర్‌కు వెళ్లే రహదారి వెంబడి ఉన్న రిలయన్స్ గోదామును మంగళవారం మూసేశారు. అందులో పని చేసే కార్మికులు రోడ్డున పడ్డారు. మాకు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించారు.

రిలయన్స్ గోదాములో పని చేసే కార్మికులను ఒక ఏజెన్సీ ద్వారా తీసుకున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేస్తున్న వస్తువులు దుస్తులు, ఇతర పరికరాలను విడివిడిగా ప్యాకింగ్ చేసి అక్కడ నుంచి ఆయా ప్రాంతాలకు పంపిస్తుంటారు. ప్రస్తుతం 150 మందికి పైగా పనిచేస్తున్నారు. మంగళవారం యథావిధిగా అందరూ పనికి వచ్చారు. గోదాము వద్దకు రాగానే పని లేదని గేట్లకు తాళాలు వేశారు. కనీసం మాట మాత్రం కూడా ముందు చెప్పకుండా పని లేదని గేట్లు వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎవరు సమాధానం చెప్పకపోవటంతో గోదాము ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఆందోళన నిర్వహించారు. న్యాయం చేయాలని, పని కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. గోదాములో పని చేసే కార్మికుల జీతంలో నుంచి పీఎఫ్, ఈఎస్ఐ కింద రూ.1800 కట్ చేస్తున్నారు. పీఎఫ్ అకౌంట్ ఇవ్వమని అడుగుతుంటే ఏజెన్సీ వారిని అడగాలని, వాళ్లని అడుగుతుంటే గోదాము వారిని అడగాలని చెబుతూ కాలయాపన చేస్తున్నారు. జీతాలు కూడా సక్రమంగా ఇవ్వటం లేదు. జనవరి నెల నుంచి జీతం పెరిగిందని, ఆ పెరిగిన జీతం ఇవ్వకపోగా జాబ్ లేదని గేట్లు మూసివేశారని పలువురు ఆవేదన వెలిబుచ్చారు. ఇన్‌చార్జిగా ఉన్న రామకృష్ణ మహిళలను కూడా ఇబ్బంది పెట్టేవారని చెప్పారు. ముందస్తు సమాచారం లేకుండా తమను తొలగిస్తే ఏం చేయాలని, తమకు న్యాయం జరిగే వరకూ తమ ఆందోళన కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. రోడ్డు మీద ఆందోళన చేస్తున్న కార్మికుల వద్దకు పోలీసులు వచ్చి అనుమతి లేకుండా రోడ్డు మీదకు రాకూడదని చెప్పటంతో గోదాము ముందు షామియానా వేసి ఆందోళన చేస్తున్నారు.



పచ్చటి తివాచీలా కనువిందు చేస్తున్న మడ అడవులు





కృష్ణానదీ పాయల్లో మడ అడవులను తిలకిస్తూ బోటులో గులలమోద లైట్‌హౌస్‌కు వెళ్తున్న పర్యాటకులు





పడవ దిగి లైట్‌హౌస్‌కు వెళ్లే రోడ్డు, సోలార్ లైట్‌హౌస్

వాహ్‌..గుల్లలమోద

- 20 కిలో మీటర్లు పడవ ప్రయాణం
- పచ్చని తివాచీలా మడ అడవుల కనువిందు
- బ్రిటీష్‌కాలం నాటి లైట్‌హౌస్
- పర్యాటకాభివృద్ధికి అవకాశం

చుట్టూ పచ్చని తివాచీ పరచినట్లుగా మడ అడవుల సౌందర్యం.. పక్షుల కిలకిలారావాలు... కృష్ణానది బ్యాక్ వాటర్ .. సముద్రపు అలల సవ్వడి.. సముద్రుడి కెరటాలను ఆలింగనం చేసుకోవాలన్న ఆనందంలో పరుగులెత్తే కృష్ణవేణమ్మ పరవళ్లు.. గుల్లలమోద దీవి సొంతం. ప్రకృతి సౌందర్యాన్ని వీక్షిస్తూ పడవ ప్రయాణం చేస్తూ గుల్లలమోద లైట్ హౌస్‌ను వీక్షించడం మధురానుభూతిని స్తుంది. గుల్లలమోద దీవి అందాలకు నెలవు అంటే అతిశయోక్తి కాదు.

(ఆంధ్రజ్యోతి, నాగాయలంక)

కృష్ణాజిల్లా దివిసీమలో నాగాయలంక మండలం కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో గుల్లలమోద ఉంది. కృష్ణానది పాయల మధ్య పడవ ప్రయాణంలో పచ్చని తివాచీలా మడ అడవులు కనువిందు చేస్తాయి.

ప్రధానంగా నాగాయలంక పడవల రేవు నుంచి ప్రత్యేక పడవుల్లో గులల్లమోదకు చేరుకోవచ్చు. అంతే కాకుండా సొర్లగొంది, గుల్లలమోద, సం గమేశ్వరం, ఎదురుమొండి గ్రామాల నుంచి కృష్ణానదీ పాయల్లో ప్రయాణించి గుల్లలమోద లైట్‌హౌస్ చేరుకోవచ్చు. కృష్ణానది గుల్లలమోదలో బంగాళాఖాతంలో కలుస్తుంది. కృష్ణవేణి జడపాయలు మధ్య మడ అడవులతో నిండి ఉన్న గుల్లలమోద లైట్‌హౌస్ ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ అందాలను తనివితీరా చూడాలంటే రానుపోను ఆరు గంటలపాటు 20 కిలోమీటర్ల పైగా లాంచీలో వెళ్లాలి. దీని కోసం ప్రకృతి ప్రేమికులు ఒక పగటిపూటను కేటాయించాలి.

బ్రిటీష్ కాలం నాటి లైట్‌హౌస్

గుల్లలమోద లైట్‌హౌస్‌ని బ్రిటీష్ కాలంలో నిర్మించా రు. దీనిని 1972 సంవత్సరంలో ఆధునీకరించారు. మొ త్తం తొమ్మిది అంతస్తులతో ఉన్న ఈ లైట్‌హౌస్ ఎత్తు 135 అడుగులు. 1977లో వచ్చిన పెను ఉప్పెనకు ఐదో అంతస్తు వరకు వరద నీరు చేరినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ లైట్‌హౌస్‌ని ఆధునీకరించక ముందు సాయంకాలం దీప స్తంభాల అద్దాలను తుడిచి కిరోసిన్ దీపం వెలిగించే వారు. సుమారు 25 కిలో మీటర్ల దూరం వరకు దాని కాంతి కిరణాలు పడేవి. తదనంతరం లైట్‌హౌస్‌ని సోలార్ దీపంగా ఆధునీకరించారు. రాత్రి పూట దీప స్తంభంలోని దీపం ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తుంది.

పర్యాటక శాఖ బోట్లను నడపాలి



నాగాయలంక నుంచి గుల్లలమోద లైట్‌హౌస్‌కి ఏపీ పర్యాటక శాఖ బోట్లను నడపాలి. సందర్శకులకు బోట్లలో మంచినీరు, తిను బండారాలు, తేనీరు సౌకర్యాన్ని కల్పించాలి. చార్జీలు సందర్శకులకు, ప్రకృతి ప్రేమికులకు అందుబాటులో ఉండాలి.

-ఎం.హరనాథ్, తహసీల్దార్

పాపికొండలు తరహాలో అభివృద్ధి చేయాలి



గుల్లలమోద లైట్‌హౌస్ ప్రాంతాన్ని పాపికొండల తరహాలో అభివృద్ధి చేయాలి. టూరిజం శాఖ బోట్లను వారానికి రెండు సార్లు నడపాలి. లైట్‌హౌస్ దగ్గర పిల్లలకు పార్క్, దివిసీమ చరిత్ర తెలిపే మ్యూజియం ఏర్పాటు చేయాలి. సందర్శకులకు తక్కువ ఛార్జీలు నిర్ణయించాలి.

-చన్నగిరి లతామోహన్, ప్రకృతి ప్రేమికుడు

అంతా పడవ ప్రయాణమే..

ప్రత్యేక పడవలల్లో గుల్లలమోదకు 20 కిలోమీటర్లు వెళ్లాలంటే మత్స్యకారులు ఎక్కువ మొత్తాలను వసూలు చేస్తున్నారు. గుల్లలమోద దీప స్తంభాన్ని చూడాలని ఆసక్తి ఉన్నా...పడవ ప్రయాణంలోని భారీ చార్జీలను చెల్లించలేక వెనుకడుగు ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు. ప్రత్యేక పడవలను ఏర్పాట్లు చేసి, భోజనాలు, మంచినీటి వసతి, ప్రత్యేక సౌకర్యాలు గల పడవలు ఏర్పాటు చేసినట్లయితే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెంది, ఉపాధి అవకాశాలు దొరుకుతాయి.

కూటమి ప్రభుత్వం రాకతో చిగురించిన ఆశలు

గుల్లలమోదదలోని లైట్‌హౌస్ ప్రాంతాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలని దశాబ్దాల కాలం నుంచి ప్రకృతి ప్రేమికుల నుంచి ఒత్తిడి ఉంది. గుల్లలమోద లైట్‌హౌస్ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మండలి బుద్ధప్రసాద్ కొంత ప్రయత్నం చేశారు. జగన్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి అటకెక్కించింది. చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రావడంతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవ చూపి గుల్లలమోద లైట్‌హౌస్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తారనే అభిప్రాయం నెలకొంది.



గుల్లలమోద లైట్‌హౌస్ వద్ద పర్యాటకుల గ్రూప్ ఫొటో (ఫైల్)

కళాశాల స్థలాన్ని రక్షించుకుంటాం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

- ఎస్ఆర్ఆర్ పూర్వ విద్యార్థులు




ధర్నాలో మాట్లాడుతున్న ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, పూర్వ విద్యార్థులు

గుణదల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అన్యాక్రాంతమౌతున్న ఎస్ఆర్ఆర్ కాలేజీ భూములపై పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పోరుబాట పట్టారు. ఎస్ఆర్ఆర్ కాలేజీ భూముల మాయ శీర్షికన మంగళవారం ప్రచురితమైన ఆంధ్రజ్యోతి కథనం నేపథ్యంలో పూర్వ విద్యార్థులు స్పందించారు. భూముల అన్యాక్రాంతాన్ని నిరసిస్తూ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. కళాశాల స్థలాన్ని కాపాడుకోవటానికి ఎస్ఆర్ఆర్ కళాశాల అధ్యాపకులు కూడా ధర్నాలో పాలు పంచుకున్నారు. విజయవాడలో నాణ్యమైన విద్య అందించాలన్న ఆకాంక్షతో నూజివీడు జమిందారులు ఇచ్చిన స్థలాన్ని ఎలాగైనా దక్కించుకుని తీరుతామని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డులోగల ఎస్ఆర్ఆర్ కళాశాలకు చెందిన వివాద స్థలంలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం మంగళవారం జరిగింది. పూర్వ విద్యార్థులు, ఎస్ఆర్ఆర్ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కలిసి ఎస్ఆర్ఆర్ స్థలాన్ని ఎలాగైనా కాపాడుకుంటాం, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి, స్థలంలో ఉన్న నిర్మాణాలు ఖాళీ చేయించి కళాశాలకు అప్పగించేంత వరకు పోరాటం ఆగదు అంటూ నినాదాలు చేశారు. ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎస్ఆర్ఆర్ కళాశాల విజయవాడ నగరంలోని కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాల విషయంలో పోటీపడుతోందన్నారు. అటువంటి కళాశాల స్థలాన్ని కబ్జాకోరుల బారి నుంచి కాపాడుకోవడానికి అందరూ సహకరించాలని కోరారు. పూర్వవిద్యార్థులు, ఎస్ఆర్ఆర్ కళాశాల సిబ్బంది కలిసి ఆక్రమిత స్థలంలో మరో రెండు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి చిగురుపాటి యుగంధర్, ఉపాధ్యాక్షుడు ఆళ్ళ వేణుగోపాలరావు, కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, మాజీ డిప్యూటీ మేయర్ చెరుకూరి కృష్ణ కుమార్(నాని), కె.పి.రావు తదితరులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం చొరవ చూపి 7.28 ఎకరాల విస్తీర్ణం స్థలాన్ని కాబ్జాకోరుల బారి నుంచి స్వాధీనం చేసుకుని కళాశాలకు అప్పగించాలని సీపీఐ నేత దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపుగా నేరుగా ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో విద్యార్థి సంఘాలు, నగర ప్రజలను కలుపుకుని ప్రజా ఉద్యమం చేపడతామన్నారు. ఎస్ఆర్ఆర్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు లంకా జానయ్య మాట్లాడుతూ కళాశాల స్థలాన్ని కాపాడుకునేందుకు ప్రత్యేకంగా ప్రభుత్వం తరుపున లీగల్ టీమ్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కబ్జాదారుడు తెచ్చుకున్న స్టేట స్కోను రద్దు చేయించే విషయంలో ప్రభుత్వం కలుగజేసుకోవాలని డిమాండ్ చేశారు.

హోదా ఒకరిది..సంతకం వేరొకరిది

ఓపెన్ టెన్త్ హాల్ టికెట్ల జారీలో గందరగోళం


1320503-GVJ Z P HIGH SCHOOL(B),JAGGAIAHPETA(T),JAGGAIAHPETA(M),NTR
M. Radha K...
CO ORDINATOR
APOSS AI CODE - 1320503
GVJ ZP HIGH SCHOOL
JAGGAYYAPET ... NTR Dist.

జగ్గయ్యపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేట బాలుర ఉన్నత పాఠశాల ఓపెన్ టెన్త్ కేంద్రం నుంచి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల హాల్ టికెట్ల జారీ ప్రహసనంగా మారింది. ఈనెల 17 నుంచి రాష్ట్రంలో ఓపెన్ టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. బాలుర హైస్కూల్ సెంటర్ నుంచి పరీక్షలకు హాజర య్యే అభ్యర్థులకు హాల్ టికెట్ల జారీ గత రెండు రోజులగా జరుగుతోంది. బాలుర హైస్కూల్ హెచ్ఎం అక్రిడేటెడ్ ఇనిస్టిట్యూట్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. హాల్ టికెట్లపై ఒక వైపు పరీక్షల డైరెక్టర్ డిజిటల్ సంతకం మరో వైపు ఏఐ కోఆర్డినేటర్ సంతకం ఉండాలి. జగ్గయ్యపేట బాలుర హైస్కూల్ హెచ్ఎం మాధవీలత సంతకంతో జారీ చేయాల్సిన హాల్ టికెట్లపై ఎం.రాధాకృష్ణ అనే ఉపాధ్యాయుడి సంతకంతో ఇస్తున్నారు. ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో ఏఐ కోఆర్డినేటర్‌గా ఉన్న ఆమెను నిబంధనలకు విరుద్ధంగా స్థానికంగా రెండు ప్రైవేట్ స్కూల్స్ పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌గా నియమించారు. దీనిపై ఫిర్యాదులు రావటం, ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవటంతో ఆమెను సిట్టింగ్ స్క్వాడ్ విధుల నుంచి తొలగించారు. ఇప్పుడు ఆమె పేరుతో జారీ చేయాల్సిన హాల్ టికెట్లు వేరే వ్యక్తి ఆమె హోదాతో ఏఐ కోఆర్డినేటర్‌గా సం తకాలు చేయటం గందర గోళానికి దారి తీసింది. పరీక్షార్థులు ఈ హాల్ టికెట్లు చెల్లుతాయా లేదా అని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఎగ్జామ్స్ కోఆర్డినేటర్ వెంకటప్పయ్యను వివరణ కోరగా, తన దృష్టికి రాలేదని చెప్పారు. ఏఐ కోఆర్డినేటర్ కాని వేరే వ్యక్తులు సంతకం చేయకూడదని వివరణ ఇచ్చారు. డీఈవో సుబ్బారెడ్డిని వివరణ కోరగా బాలుర హైస్కూల్ ఏఐ కో ఆర్డినేటర్‌ను తామేమి మార్చ లేదని, రాష్ట్ర అధికారులు మార్చినట్టు తనకు సమాచారం లేదని చెప్పారు.

ఎన్నికల ప్రక్రియలో సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చు

ఎన్నికల సంఘం డైరెక్టర్ అనూజ్ చందక్

మచిలీపట్నం,మార్చి11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం డైరెక్టర్ అనూజ్ చందక్ పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు, వివిధ ప్రధాన రాజకీయ పార్టీల నాయకులకు లేఖ రాశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియలో సమస్యలు, ఇబ్బందులు ఉంటే వాటిని నేరుగా అన్ని రాజకీయపార్టీల నాయకులు కేంద్ర ఎన్నికల సంఘానికి తెలియపరిచే వెసులుబాటును కల్పించినట్లు లేఖలో పేర్కొన్నారు.

జిల్లా ఎన్నికల అధికారి, ప్రధాన ఎన్నికలఅధికారి స్థాయి లో పరిష్కారం కాని సమస్యలు ఉంటే రాజకీయ పార్టీల నాయకులు కేంద్ర ఎన్నికల సంఘానికి నేరుగా తెలియ జేయవచ్చన్నారు. సమస్యలపై రాజకీయపార్టీల నాయకులతో చర్చించి,వాటి పరిష్కారమార్గాలపై చర్చలు జరిపి తగు నిర్ణయం తీసుకుంటామని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీలోగా రాజకీయపార్టీల నాయకులు కేంద్ర ఎన్నికలసంఘానికి సమస్యలను తెలియజేయాలని ఆయన సూచించారు.

గోరా టెక్నోహబ్ ప్రారంభం రేపు

బెంజిసర్కిల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యువతను అత్యాధునిక టెక్నాలజీ వైపు నడిపించే దిశగా ఈనెల 13వ తేదీన విజయవాడలోని నాస్తిక కేంద్రంలో గోరా టెక్నో హబ్‌ను ప్రారంభిస్తున్నట్లు గోరా టెక్నో హబ్ ఛైర్మన్ డాక్టర్ జి. సమరం చెప్పారు. నాస్తిక కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోరా టెక్నో హబ్‌ను ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, డీఆర్‌డీఏ మాజీ ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షత వహిస్తారన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీని యువతకు చేరువ చేయడం కోసమే టెక్నో హబ్‌ను ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు పరుగులు పెడుతుందన్నారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మరింత చేరువచేసేందుకు టెక్నో హబ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ వర్క్‌షాపులు, సెమినార్‌లను నిష్ణులైన శాస్త్రవేత్తలతో నిర్వహిస్తామని డాక్టర్ సమరం చెప్పారు. గోరా టెక్నో హబ్‌లో అంతరక్షశాలనే ఏర్పాటు చేశామన్నారు. అందులో చంద్రయాన్-3, శాటిలైట్, చంద్రుని మీద ఓవర్ ప్రయాణం, స్పేస్‌షిప్స్ వంటి ఎన్నో ఆసక్తికర అంశాలను పొందుపరిచామన్నారు. సమావేశంలో గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ నియంత, రష్మీ, సకల తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో పీ4 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఉన్నతాధికారులు

పీ4తో పేదరికం లేని సమాజం

మచిలీపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యం పీ4తో ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి చేకూరుతుందని కలెక్టర్ డీకేబాలాజీ అన్నారు. తన చాంబర్‌లో మంగళవారం పీ4 పోస్టర్‌ను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 దిశగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసిందన్నారు. సమాజంలోని 20 శాతం మంది అత్యంత నిరుపేదలను గుర్తించి, వారు ఆర్థికంగా నిలదొక్కకునేందుకు కార్యాచరణను రూపొందించిందన్నారు. పేదలను ఆదుకునేందుకు 10శాతం తెలుగు ప్రవాసులు, సంపన్నుల సహకారం తీసుకుని ప్రభుత్వం పేదరికం లేని సమాజాన్ని సాధించడానికి సంకల్పించిందన్నారు. ప్రజలు తమ విలువైన అభిప్రాయాలను ఈనెల 25వతేదీలోగా హెచ్‌టీటీపీఎస్://స్వర్ణాంధ్ర.ఏపీ.జీవోవి.ఇన్/పీ4ద్వారా తెలియజేయవచ్చన్నారు. ఉగాది రోజున పీ4 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరిస్తారని తెలిపారు. జేసీ గీతాంజలిశర్మ, డీఆర్‌వో కే చంద్రశేఖరరావు, సీపీవో గణేష్‌కృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి నడకుదిటి తల్లి ఈశ్వరి మీనాక్షి అస్తమయం



మేనత్త ఈశ్వరి మీనాక్షి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు తల్లి ఈశ్వరి మీనాక్షి (94) మంగళవారం కన్నుమూశారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తె. వీరిలో నడకుదిటి నరసింహారావు, శేషగిరి మృతి చెందారు. మరో కుమారుడు నడకుదిటి అర్జున, కుమార్తెలు నాగమణి, కనకదుర్గ తల్లి భౌతిక కాయం వద్ద కన్నీరు మున్నీరయ్యారు. మేనత్త అయిన ఈశ్వరి మీనాక్షి భౌతికకయాన్ని మంత్రి కొల్లు రవీంద్ర, ఆయన సతీమణి కొల్లు నీలిమ టీడీపీ నాయకులు, బంధువులు, స్నేహితులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మైక్రో ఇరిగేషన్ ఫండ్ వివరాలివ్వండి : బాలశౌరి

మచిలీపట్నం, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : మైక్రో ఇరిగేషన్ ఫండ్ లక్ష్యాలు, కేటాయించిన బడ్జెట్ వివరాలను తెలియజేయాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం జరిగిన పార్లమెంటు సమావేశాల్లో కోరారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో మైక్రో ఇరిగేషన్ ఫండ్‌కు నిధులను రూ.10 వేల కోట్లకు పెంచారా లేదా, పెంచకపోతే అందుకు గల కారణాలు, గత మూడు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో అమలు చేసిన ప్రాజెక్టు వివరాలను తెలియజేయాలని కోరారు. కేంద్రవ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి రామ్‌నాథ్ ఠాగూర్ ఈ ప్రశ్నలకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2018-29 సంవత్సంలో ఈప్రాజెక్టుకు రూ.5 వేల కోట్లు, 2021-22లో రూ.10వేల కోట్లు, 2022-23లో రూ.740కోట్లు, 2023-24లో రూ.290కోట్లను మంజూరుచేసి ఆయా రాష్ట్రాలలో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు తెలిపారు.

కోదాడలో గంజాయి ముఠా అరెస్టు

సూర్యాపేట క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ లో గంజాయి అమ్ముతున్న కృష్ణాజిల్లాకు చెందిన ఐదుగురిని సూర్యాపేట పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ కొత్తపల్లి నర్సింహ జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కనుమూరుకు చెందిన మల్లెడ వెంకట వంశీ, వణుకూరుకు చెందిన గోకుల మూడి ఆనంద్ ఒడిషా రాష్ట్రంలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తుంటారు. కోదాడలో గంజాయిని యువకులకు విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న కోదాడ పట్టణ పోలీసులు దాడి చేశారు. వెంకటవంశీ, ఆనంద్, విజయవాడ నుంచి గంజాయి కోసం వచ్చిన యువకులు తెచ్చిన బైక్‌పై పరారయ్యారు. తేజ, పాలపర్తి క్రిష్ణచైతన్య, సంపత్‌కుమార్, నాగవీరభాస్కర్‌రావు, హేమస్ నర్సింహసాయి పట్టుకోవడంతో పాటు రూ.లక్ష విలువ చేసే 9.860 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



ఆత్కూరు పల్లెనిద్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ ఆర్.గంగాధరరావు

పోలీస్ వ్యవస్థ పట్ల నమ్మకం పెంపు లక్ష్యంగా పల్లెనిద్ర

ఉంగుటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పోలీసింగ్ వ్యవస్థ పట్ల నమ్మకాన్ని పెంచేందుకు గ్రామీణ ప్రాంతాల్లో పల్లెనిద్ర చేపట్టినట్లు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. ఆత్కూరు జడ్పీహైస్కూల్‌లో స్థానిక పోలీసు అధికారులతో కలిసి ఆయన పల్లెనిద్ర చేశారు. స్థానిక సమస్యలపై చర్చించి, నేరాలు జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గస్తీ పెంపు, పోలీస్ మిత్ర బృందా ఏర్పాటుతో నేరాల అదుపుకు సమాలోచనలు జరిపారు. పల్లెనిద్ర కార్యక్రమంతో సమస్యాత్మక గ్రామాల్లో నిఘాను మరింత పటిష్టంచేసి, శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఆస్కారముంటుందన్నారు. పోలీసులు ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఉన్నారని, వారి సేవలను నిర్భయంగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈకార్యక్రమంలో సీఐ కేవీవీఎన్ సత్యనారాయణ, ఎస్సై చావా సురేష్, పోలీస్‌సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



వైద్య విద్యార్థుల క్రీడా నైపుణ్యం అభినందనీయం

గన్నవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యార్థులు క్రీడల్లో రాణించటం అభినందనీయమని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం అన్నారు. చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో హెల్త్ యూనివర్శిటీ 26వ పురుషుల అంతర్ క్రీడా పోటీలు ఫేజ్-1 మంగళవారంతో ముగిశాయి. ఈ సభలో వీసీ డాక్టర్ నరసింహం మాట్లాడుతూ వైద్య విద్యార్థుల దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు యూనివర్శిటీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సిద్ధార్థ అకాడమి అధ్యక్షుడు మలినేని రాజయ్య మాట్లాడుతూ క్రీడా పోటీలు నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. విజేతలకు బహుమతులు, పతకాలు, సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ సివి రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి భీమేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, యూనివర్శిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇత్రిమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవినేని రవి తదితరులు పాల్గొన్నారు.



గన్నవరం విమానాశ్రయంలో తిరిగొచ్చిన మయన్మార్ శరణార్థులు

మయన్మార్ నుంచి ఏడుగురు శరణార్థులు రాక

- కుటుంబసభ్యులకు అప్పగించనున్న సీఐ శివ ప్రసాద్

గన్నవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మయన్మార్ నుంచి ఏడుగురు శరణార్థులు మంగళవారం రాత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. మయన్మార్‌లో ఫేక్ వీసాలతో ఉద్యోగాల కోసం వెళ్లిన వారిని తిరిగి పంపడంతో ఇండియన్ గవర్నమెంట్ సహాయంతో ఢిల్లీ తీసుకురాగా, అక్కడ నుంచి ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. విజయవాడకు చెందిన షేక్ కహాఫ్, సయ్యద్ ఆఫ్రిద్, జోయల్ సన్నీ (గుంటూరు), చిల్లి త్రిదేవ్(రాజమండ్రి), షేక్ గౌస్ మస్తాన్(ఫిరంగిపురం), షంషేర్ భాషా(ప్రొద్దుటూరు), రాకేష్‌కుమార్(విశాఖపట్నం)లను గన్నవరం సీఐ బివి శివ ప్రసాద్ రిసీవ్ చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారిని కుటుంబ సభుయలకు అప్పగిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైల్వే టీటీఈ, ఆర్‌పీఎఫ్ పోలీసుల చొరవ

- రైల్వే ఉన్నతాధికారుల అభినందన

రైల్వేస్టేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కపుర్తలా రైలు కోచ్ ఫ్యాక్టరీ (ఆర్‌సిఎఫ్) మాజీ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్ ఈనెల 6వ తేదీన 20677 వందేభారత్ రైలులో ప్రయాణం చేస్తూ విజయవాడలో దిగే సమయంలో ల్యాప్‌ట్యాప్‌ను మరచిపోయారు. ల్యాబ్‌టాప్‌ను ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆయనకు అందజేశారు. తనకు ల్యాప్‌టాప్‌ను అందజేయటంలో చొరవ చూపిన టీటీఈ, ఆర్‌పీఎఫ్, రైల్వే అధికారులను అభినందించారు. శ్రీనివాస్ తాను రైలులో ప్రయాణిస్తూ ల్యాప్‌టాప్‌ను వినియోగించారు. విజయవాడలో ఆయన దిగుతూ ల్యాప్‌టాప్‌ను తన సీటులోనే మరచిపోయారు.

చెన్నై డివిజన్‌కు చెందిన ఆన్‌బోర్డు ట్రావెలింగ్ టిక్కెట్ ఎగ్జామినర్ టీటీఈ తాను విధుల నుంచి దిగుతూ సీటులను తనిఖీ చేసినప్పుడు అతనికి ల్యాప్‌టాప్ కనిపించింది. వెంటనే ఆ సమాచారాన్ని విజయవాడ డివిజన్ ఆర్‌పీఎఫ్ సిబ్బందికి తెలియజేశారు. వెంటనే రిజర్వేషన్ చార్టులను పరిశీలించి శ్రీనివాస్ పేరును గుర్తించి అందజేశారు. వృత్తి నైపుణ్యం, సమగ్రత, సమర్థత, ప్రయాణికుల సేవల పట్ల అంకిత భావం, నిబద్ధతను గుర్తుచేసి వారిని ప్రశంసించారు.

ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో ఏఎన్ఆర్ విద్యార్థికి బంగారు పతకం



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పి.జె.ఎస్.కుమార్

గుడివాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : ఏలూరిలోని చింతలపూడి గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీల వ్యక్తిగత విభాగంలో అక్కినేని నాగేశ్వరరావు కళాశాల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థి నత్తా నితీష్‌కుమార్ బంగారు పతకం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కళాశాల ఆవరణలో పతకం సాధించిన విద్యార్థిని అభినందించారు. పతకం సాధించిన నితీష్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ వీర్ల గోపిలను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

గుడివాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్టు గుడివాడ అర్బన్, రూరల్‌లో 15పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మండల విద్యాశాఖ అధికారి బి.బాలాజీ అన్నారు. మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఫాదర్ బీయాంకీ, మాంటిస్సోరి పాఠశాల, ఏజీకే, ఎస్పీఎస్, ఆంధ్ర నలంద, ఏకేటీపీ, బేతవోలు ఉన్నత పాఠశాల, విశ్వభారతి, విద్యాలయ, త్రివేణి, హోలీక్రాస్, ఉషోదయ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రూరల్ పరిధిలోని మోటూరులో గల గురుకుల పాఠశాలలో ఓ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 15 పరీక్షా కేంద్రాల్లో 2800మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. సీఎస్ డీవో , ఇన్విజిలేటర్లు మొత్తం 170మంది నియమించామన్నారు. ఓపెన్ టెన్త్ నిర్వహణకు పట్టణంలోని ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేకంగా పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. సుమారు 50మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నట్టు తెలిపారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించేందుకు ఉన్నత అధికారుల సూచనల మేరకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో బాలాజీ తెలిపారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారి రమేష్

కూచిపూడి : ఈ నెల 17వ తేదీ నుంచి జరుగనున్న పది పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని కృష్ణా జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి జి.రమేష్ సూచించారు. ఆయన మంగళవారం అవనిగడ్డ డివిజన్ వెల్ఫేర్ అధికారి దివ్యతో కలసి మొవ్వలోని కూచిపూడి సిద్ధేంద్ర జెడ్పీ పాఠశాల, మొవ్వ జెడ్పీ పాఠశాల, బీసీ హాస్టల్‌లో చదివే పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు అందజేశారు. బీసీ హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థులు జిల్లాలో 143 మంది ఉండగా, 3 నుంచి 12వ తరగతి వరకు 2022 మంది విద్యార్థులు వసతి పొందుతున్నట్టు రమేష్ తెలిపారు.



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి ఎంఎస్ . రాణి

సంపద తయారీ కేంద్రం పరిశీలన

పమిడిముక్కల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రత్యేకాధికారి ఎంఎస్ రాణి మంగళవారం ఎంపీడీవో డి.వెంకటేశ్వరరావుతో కలసి హనుమంతపురంలో పర్యటించి చెత్త నుంచి సంపద తయారీ, వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాలను పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణపై సిబ్బందిని ఆరాతీసి స్థానికులకు అవగాహన కల్పించారు. గ్రామంలో తాగునీటి సరఫరా, తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల పనితీరును పరిశీలించారు. సర్పంచ్ రాంబాబు, పాల్గొన్నారు.



పీ4 సర్వే నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు

పేదలను ఆర్థికంగా బలోపేతం చేయటమే లక్ష్యం

పెదపారుపూడి , మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు సర్వేకి సహకరించాలని ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి అన్నారు. మంగళవారం ఈదులమద్దాలి గ్రామంలో పీ4 సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పీ4 సర్వే ద్వారా పేదలను ఆర్థికంగా బలోపేతం చేయటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం ప్రస్తుతం వివిధ వర్గాలకు అందిస్తున్న వివిధ పథకాలతోపాటు అత్యంత వెనుకబడిన వర్గాలకు మరింత మద్దతు అందించటానికి చొరవ తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణవేణి, సచివాలయ సిబ్బంది విజయ్ తదితరులు పాల్గొన్నారు.



నోరీ దత్తాత్రేయుడికి స్వాగతం పలుకుతున్న స్థానికులు

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న దత్తాత్రేయుడు

పమిడిముక్కల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మంటాడలో అలివేలు మంగ, పద్మావతీ సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామిని ప్రముఖ క్యాన్సర్ నిపుణుడు నోరీ దత్తాత్రేయుడు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు మంటాడ, తాడంకి గ్రామాలకు చెందిన పలువురు ఘనస్వాగతం పలికారు. స్వామిని దర్శించుకున్న ఆయనకు అర్చకులు ఆశీర్వచనాలు పలికి స్వామి శేష వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తాను రచించిన మంటాడ టు మ్యాన్ హ్యాటన్ పుస్తకాన్ని స్థానికులకు ఆయన అందజేశారు. అనంతరం గీతామందిరాన్ని సందర్శించగా ఆలయ కమిటీ స్వాగతం పలికారు. తాడంకిలో తాను జన్మించిన ప్రదేశాన్ని సందర్శించి కొద్దిసేపు అక్కడి వారితో గడిపారు.

ముగిసిన లూర్థుమాత ఉత్సవాలు

నందివాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గత మూడ్రోజులుగా నిర్వహిస్తున్న వెన్ననపూడి లూర్థుమాత ఉత్సవాలు మంగళవారంతో ముగిసినట్టు చర్చి ఫాదర్ అమర్లపూడి కరుణాకర్‌రావు తెలిపారు. మూడోరోజు ఉత్సవాల్లో ముఖ్యాతిథిగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. వెన్ననపూడి లూర్థుమాత భక్తులతోపాటు వెనిగండ్ల దేవాలయంలో ఫాదర్ కరుణాకరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వెన్ననపూడి లూర్థుమాత ఉత్సవాలకు మండలంలోని 23 గ్రామాల ప్రజలే కాకుండా దూర ప్రాంత ప్రజలు కూడా వచ్చి లూర్థుమాత ఉత్సవాల్లో పాల్గొనటం విశేషం. ఈ మూడ్రోజులు ఉత్సవాలకు వచ్చే భక్తులకు గ్రామస్థుల సహకారంతో అన్నసమారాధన చేశామని చర్చి ఫాదర్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై కె.శ్రీనివాస్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెనిగండ్ల రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, అంగుదుల యేసుపాదం, టీడీపీ నాయకులు, విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కూటమితోనే సాధ్యం

గుడివాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో డ్వాక్రా వ్యవస్థను తీసుకొచ్చి మహిళలకు ఆర్థిక స్వేచ్ఛనిచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వెన్నంటే మహిళలుంటారని నియోజకవర్గ అంగన్వాడీ, డ్వాక్రా అధ్యక్షురాలు రమ్యశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడీలకు జీతాల పెంపు, డ్వాక్రా మహిళలకు రుణాలను ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గత వైసీపీ పాలనలో అంగన్వాడీలు, డ్వాక్రా సిబ్బందికి కనీసం జీతాలు ఇవ్వలేదని గుర్తు చేశారు. జగన్ హయాంలో తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని పోరుబాట పట్టిన అంగన్వాడీలు, డ్వాక్రా సిబ్బందిపై అమానుషంగా దాడులు చేయించారన్నారు. టీడీపీ హయాంలో పెంచిన జీతాలను సైతం ఇవ్వలేదన్నారు. తెలంగాణ కన్నా రూ.1000లు ఎక్కువ ఇస్తానని హామి ఇచ్చిన జగన్, అసలు జీతాలకే ఎసరు పెట్టాడని విమర్శించారు. మహిళలందరూ ఏకమై ఆరాచక పాలనకు స్వస్తి పలికారన్నారు. ఈ సమావేశంలో నాయకురాలు మాదాల సునీత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ అంగన్వాడీ, డ్వాక్రా అధ్యక్షురాలు రమ్యశ్రీ



నాట్యప్రదర్శనలో సంధ్య శిష్య బృందాలు

ఘనంగా రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

కూచిపూడి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా ప్రముఖ నాట్యాచార్యులు వేదాంతం రాధేశ్యామ్ ఆధ్వర్యంలో కూచిపూడి సిద్ధేంద్ర కళావేదికపై మంగళవారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను రంజింపజేశాయి. కళానృత్య నికేతన్ స్కూల్ ఆఫ్ కూచిపూడి , డాక్టర్ బిందు అభినయ్ బృందం జతిస్వరం, రామాయణ శబ్దం అంశాలను ప్రదర్శించి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నాట్యాచార్యులు యేలేశ్వరపు వెంకటేశ్వర్లుచే శివాష్టకం అంశాన్ని ప్రదర్శించారు. దివ్వెల సంధ్య శిష్యబృందం కొండలలో నేలకొన్న అంశాలు ప్రదర్శించి ఆద్యంతము భక్తిభావంలో ముంచెత్తారు. నెల్లూరుకు చెందిన గీతాకృష్ణ, హరికృష్ణలు బాలాత్రిపుర సుందరి, ఆదిలక్ష్మీ కామేశ్వరి అంశాలు ప్రదర్శించి మెప్పించారు. నాట్యాచార్య డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ నిర్వహణలో గొల్ల కలాపం కూచిపూడి నృత్య రూపకాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆనందడోలికల్లో ముంచెత్తారు. గొల్లభామగా వేదాంతం సిద్ధేంద్ర వరప్రసాద్ అభినయించగా, సూత్రధారిగా డాక్టర్ రాధేశ్యామ్ వ్యవహరించారు.

కార్మికులకు ఈ-శ్రమ్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న కార్మికశాఖ అధికారి బిందు

గుడివాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : కార్మికులందరూ ఈ-శ్రమ్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని గుడివాడ కార్మికశాఖ అధికారి వీఎస్ బిందు కోరారు. స్థానిక ఆటోనగర్‌లో సీఐటీయూ అనుబంధ ది కృష్ణాజిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆటోనగర్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసంఘటితరంగ కార్మికులు ఈ-శ్రమ్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఆటోనగర్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులందరూ తరలివచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్, నాయకులు ఆంజనేయులు, రషీద్ బేగ్, మొహిద్దీన్, త్రినాథ్, నాగరాజు, జోజిరాజు, కాజా, రహమాన్, కూనపరెడ్డి రాంబాబు, గాంధీ, నాగేశ్వరరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాసరావు

హిందూ శ్మశానవాటిక నిర్మించాలని వినతి

తోట్లవల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నార్త్‌వల్లూరు ప్రజలకు హిందూ శ్మశానవాటిక నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఎం. రవికుమార్‌కు స్థానికులు యార్లగడ్డ శ్రీనివాసరావు, యార్లగడ్డ శివ నాగేశ్వరరావు మంగళవారం వినతి పత్రం అందజేశారు. నార్త్‌వల్లూరుకు ప్రత్యేక శ్మశాన వాటిక లేకపోవటంతో సౌత్‌వల్లూరు శ్మశానవాటికను వినియోగించాల్సి వస్తోందన్నారు. పంచాయతీ అధికారులు చొరవ చూపి స్థలం కేటాయించి , శ్మశానవాటికను నిర్మించాలని వారు కోరారు.

పదో వార్డులో ఇఫ్తార్‌విందు

గుడివాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ నెల సందర్భంగా మంగళవారం రాత్రి ముస్లిం మైనార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మేనల్లుడు పెద్దు శ్రీకాంత్ పాల్గొన్నారు. మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు అందించారు. ముస్లిం పెద్దలు ముజాహిద్, జునైద్, జానీ షరీఫ్, షేక్ ఇబ్రహీం, సయ్యద్ జబీన్, మున్వర్, రఫీ, పాల్గొన్నారు.



ఇఫ్తార్‌విందులో పాల్గొన్న టీడీపీ నాయకులు శ్రీకాంత్

జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయాలి

గుడ్లవల్లేరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) :మార్చి 14న పిఠాపురంలో నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభకు జనసైనికులు పెద్దసంఖ్యలో తరలిరావాలని జనసేన నాయకులు పిలుపునిచ్చారు. మండల జనసేన అధ్యక్షులు తోట చిన్నారి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహిస్తున్న జనసేన ఆవిర్భావ సభకు ప్రత్యేకత ఉందన్నారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల జనసేన ఉపాధ్యక్షులు చందన వెంకటరాజు, ప్రధాన కార్యదర్శి బుల్లా కింగ్, కటకం కొండ, అంకినీడు, అడపా బాబి, మాదాసు కొండ, కోలా అభిరూప్, చిలంకుర్తి వెంకి, గోన శ్రీను, వేమూరి త్రినాథ్, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న తోట చిన్నారి

యువతపోరు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

గుడివాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : మోసాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యువతనూ మోసం చేసిందని వైసీపీ నాయకులు మండలి హనుమంతరావు అన్నారు. మంగళవారం స్థానిక భయ్యావారి వీధిలోని మండలి వ్యక్తిగత కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో చేపట్టనున్న యువతపోరు ధర్నా గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయంబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతిపై చంద్రబాబు సర్కారు మాట తప్పిందని ఆరోపించారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వంపై పోరాడేందుకు యువత పోరు పేరిట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, నాయకులు మెరుగుమాల కాళీ, తులిమిల్లి యేషయ్య, పాలేటి చంటి, వెంపటి సైమన్, మట్టా జాన్ విక్టర్, షేక్ సయ్యద్, మాదాసు వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

ముమ్మరంగా విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న బి.శ్రీనివాసరావు, తదితరులు

గుడివాడ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు విద్యుత్ విజిలెన్స్ విభాగం కృష్ణాజిల్లా గుడివాడరూరల్ పరిధిలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో 40 బృందాలుగా 150 మంది సిబ్బంది పాల్గొని మొత్తం 3230 సర్వీసులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో అనుమతించిన లోడుకు మించి విద్యుత్ వినియోగించిన 310 మందిపై రూ.12,32,000లకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ అధికారుల తనిఖీలలో సీలు లేకపోవటం, గాటులు పెట్టడం వంటివి గమనిస్తే విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో డివిజన్ ఇంజనీర్‌లు బి.శ్రీనివాసరావు, సీహెచ్. వాసు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, జూనియర్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

గుడివాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం కన్న కూటమి ప్రభుత్వంలో విద్యుత్ బిల్లులు రెట్టింపు వస్తోందని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలో ప్రజాచైతన్యయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు బాదుడే బాదుడు అనే కార్యక్రమం కూటమి చేపట్టిందని గుర్తు చేశారు. అధికారంలోకి వస్తే విద్యుత్ సర్‌చార్జీలు, సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీలు తగ్గిస్తానని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. వచ్చీ రాగానే రూ.16వేల కోట్లు భారాన్ని ప్రజలపై మోపారని ఆరోపించారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆర్ సీపీ రెడ్డి, సభ్యులు పి.రజిని, రేపాని కొండ, లంకా సురేంద్ర, కృష్ణకిషోర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి ప్యాలెస్ ఎదుట పోరుబాట చేపట్టాలి

● టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి

గుడివాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : వైసీపీ ముఠా జగన్‌రెడ్డి తాడేపల్లి ప్యాలెస్ ఎదుట యువత పోరుబాట నిర్వహించాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ సత్యసాయి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దమ్ముంటే వైసీపీ బ్యాచ్ పోరుబాట జగన్‌రెడ్డి తాడేపల్లి ప్యాలెస్ ఎదుట చేపట్టాలన్నారు. జగన్ అండ్ కో గతంలో పోరుబాట పేరుతో ఘోరంగా విఫలమైందన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను మోసం చేసింది జగన్‌రెడ్డే అని అన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న సైకో జగన్ ఇప్పుడు విద్యార్థులకు న్యాయం చేయాలని పిలుపునివ్వడం హాస్యాస్పదమన్నారు. పాత ఫీజురీయంబర్స్‌మెంట్ విధానం ద్వారా రూ.780కోట్లు బకాయిలను విడుదల చేసిన ఘనత రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు దక్కుతుందన్నారు. తన హయాంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ రూ.2832కోట్లు, వసతి దీవెన కింద రూ. 898కోట్లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ రూ.450కోట్లు బకాయిలు పెట్టి దొంగ ఏడుపులు ఏడుస్తున్నాడన్నారు. బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చుని నీచరాజకీయాలు నడుపుతున్న వైసీపీ దొంగల ముఠా నాయకుడు జగన్‌రెడ్డి అని ఆరోపించారు. ఈ సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సూరిబాబు, సురేంద్ర, పాపారావు, ఇషాక్, సాయి, ఉపేంద్ర, నాగరాజు, క్రాంతి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95, 102, 112
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

ఎస్సీ, బీసీలను పెద్దల సభకు పంపిన ఘనత చంద్రబాబుదే

అవనిగడ్డ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, బీసీలను పెద్దల సభకు పంపిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మెల్సీ పదవులను ఎంతో మంది ఆశించినా గ్రీష్మ, బీద రవిచంద్ర యాదవ్, బీటీ నాయుడులను పెద్దల సభకు పంపించి, బడుగులకు తానిచ్చే ప్రాధాన్యత మరోసారి స్పష్టం చేశారన్నారు. బీసీల అభ్యున్నతికి ఎన్టీఆర్ ఎనలేని కృషి చేశారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కర్రా సుధాకర్, బండే రాఘవ, బచ్చు రఘునాథ ప్రసాద్, దాసినేని శ్రీనివాసరావు, కొల్లూరి వాసు తదితరులు పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య

పెడన, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి.రామకృష్ణయ్య సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రామ కృష్ణయ్య మాట్లాడుతూ, చట్టాలపై అవగాహన లేనందునే చాలా మంది న్యాయం పొందలేక పోతున్నారన్నారు. ఈ సదస్సులో న్యాయవాది చీలి మునలయ్య, ఎంఈవో-2 వై.వి.హరనాథ్, హెచ్ఎం అద్దంకి అశోక్‌కుమార్, ఇన్‌చార్జి హెచ్ఎం బూసం తీర్థావతి, స్టాఫ్ సెక్రటరీ కె.ఎ.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు

మచిలీపట్నం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల సీనియారిటీ జాబితాలపై దాదాపు 400 మంది టీచర్లు తమ అభ్యంతరాలను తెలిపారు. టీచర్లు ఇచ్చిన అభ్యంతరాలపై డీవైఈవోలు మంగళవారం నుంచి పరిశీలన కార్యక్రమం ప్రారంభించారు. డీఈవో పి.వి.జె. రామారావు పర్యవేక్షణలో ఉయ్యూరు డీవైఈవో పద్మారాణి, గుడివాడ డీవైఈవో రవికుమార్, మచిలీపట్నం డీవైఈవో శేఖర్‌సింగ్‌లు అభ్యంతరాలను పరిశీలిస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన 11వేల మంది టీచర్ల సీనియారిటీ లిస్టును ప్రకటించారు. దీనిపై 400 మంది టీచర్లు వివిధ కారణాలతో అభ్యంతరాలు తెలుపుతూ అర్జీలు సమర్పించారు.

మచిలీపట్నానికి ఓపెన్ స్కూల్స్ ప్రశ్నాపత్రాలు

కృష్ణాజిల్లాలో ఓపెన్ స్కూల్స్ 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల ప్రశ్నా పత్రాలు మంగళవారం లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోస్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయి. డీఆర్వో కె.చంద్రశేఖర్, డీఈవో పి.వి.జె. రామారావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజులు గట్టి పోలీసు బందోబస్తు మధ్య ప్రశ్నాపత్రాలను భద్రపరిచారు.

వైసీపీ యువత పోరు.. సిగ్గుచేటు

మోపిదేవి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతీ ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి మోసం చేసి ప్రస్తుతం యువతపోరు నిర్వహిస్తుండటం సిగ్గుచేటు అని తెలుగు యువత నాయకులు ఆరోపించారు. మంగళవారం మోపిదేవిలోని తెలుగుయువత కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి, జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ, అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షు లు మేడికొండ విజయ్ పుప్పాల యేసు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చల్లపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి మండలం లక్ష్మీపురం సబ్‌స్టేషన్ పరిధిలోని మంగళాపురంలో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ డి.కృష్ణనాయక్ తెలిపారు. గ్రామంలో ఆర్‌డీఎస్ఎస్ పనులకు సంబంధించి విద్యుత్‌శాఖ మరమ్మతులు, విద్యుత్ స్తంభాలు మార్చాల్సి ఉందన్నారు. ఇందుకోసం మంగళాపురం ఫీడరును నిలుపుదల చేస్తామనీ, వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

డీఆర్వో చంద్రశేఖర్, డీఈవో రామారావు

మచిలీపట్నం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలను విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్రశేఖర్, డీఈవో పి.వి.జె. రామారావులు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మచిలీపట్నం లేడీ యాంప్తిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డీఆర్వో చంద్రశేఖర్, డీఈవో పి.వి.జె. రామారావు మాట్లాడుతూ, పరీక్షల సమయంలో రాత్రి వేళ తగినంత నిద్ర పోవాలన్నారు. ఎక్కు వ మార్కులు సాధించే విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఉంటున్నా యన్నారు. ఈ కార్యక్రమానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పి. శ్రీరామ్ అధ్యక్షత వహించారు. లేడీయాంప్తిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేసిన డీఆర్వో చంద్రశేఖర్, డీఈవో రామారావు

పది విద్యార్థులకు పరీక్షా కిట్లు

మోపిదేవి : త్వరలో జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో కేవలం ఉత్తీర్ణత శాతమే కాకుండా అత్యధిక మార్కులు సాధించే దిశగా విద్యార్థులు కృషి చేయాలని మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణ చెప్పారు. మంగళవారం ఉదయం పెదప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన రెబ్బా వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం కుమార్తె, కుమారుడు కాకి తిరుపతమ్మ, రెబ్బా ఉమామహేశ్వరరావులు పరీక్షా కిట్లను సమకూర్చారు. వాటిని విద్యార్థులకు ఎస్సై అందజేశారు. హెచ్ఎం కె.అను రాధ, ఇన్‌చార్జి హెచ్ఎం జి.ఉమాదేవి, జి.రామ్మోహన రావు, కాకి అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హౌసింగ్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి : సీపీఎం

మచిలీపట్నం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : హౌసింగ్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు బి. సుబ్రహ్మణ్యం, కొడాలి శర్మ డిమాండ్ చేశారు. మంగళ వారం ప్రజా సమస్యలపై మేకావారిపాలెంలో సీపీఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడు తూ, వైసీపీ ప్రభుత్వం జగనన్న హౌసింగ్ కాలనీ పేరుతో ఇళ్ళస్థలాలిచ్చారని, కొందరు అప్పులు చేసి ఇళ్ళు నిర్మించుకున్నారని, ఆ కాలనీల్లో మౌలిక వసతులు లేవన్నారు ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిహెచ్. జయరావు, ఎండి యూనస్, తమ్ము యువకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో ప్రజాచైతన్య యాత్ర

చల్లపల్లి: చల్లపల్లి మండల సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై ప్రజా చైతన్యయాత్ర కార్యక్రమం జరుగుతోంది. మంగళవారం స్థానిక నారాయణరావునగర్ కాలనీలో పార్టీ నేతలు పర్యటించి ప్రజల నుంచీ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి యద్ధనపూడి మధు మాట్లాడుతూ, గురుకుల పాఠశాల సమీపంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంతర్గత రహదరులు, జంగిల్ క్లియరెన్స్ తదితర సమస్యలు ప్రజలు తెలియచేస్తున్నారని చెప్పారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు మహమ్మద్ కరీముల్లా, బళ్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మేకావారిపాలెం హౌసింగ్ కాలనీలో నాయకులు కొడాలి శర్మ, సుబ్రహ్మణ్యం, చల్లపల్లి నారాయణరావు నగర్‌లో నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ

జనసేన ఆవిర్భావ సభకు తరలిరండి : బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో ఈనెల 14న జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పవన్‌కళ్యాణ్ అభిమానులు తరలి రావాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పిలుపు నిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ శ్రేణు లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ, పెద్ద ఎత్తున పిఠాపురం వెళ్లేందుకు బస్సులు, కార్లు ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది హాజరవు తున్నారని, ఎవరికీ ఏ విధమైన ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గడ్డం రాజు, వేణు, మహేష్ పాల్గొన్నారు.

పొగాకు కషాయం తయారీపై అవగాహన

ఘంటసాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని తాడేపల్లిలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పొగాకు కషాయం తయారీ, వినియోగించే విధానంపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. పంటలో రసం పీల్చే పురుగుల నివారణకు పొగాకు కషాయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పురుగు మందులు పిచికారి చేసే సమయంలో పొగాకు కషాయం తగిన మోతాదులో వినియోగిస్తే రసంపీల్చే పురుగులు ఆశించటాన్ని కొంత మేరకు నివారించుకోవచ్చునని విద్యార్థులు తెలిపారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుధారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన్, డాక్టర్ రేవతి, కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

శీలంవారిపాలెం రామాలయంలో చోరీ

ఘంటసాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం పంచాయతీ శివారు శీలంవారిపాలెంలో చోరీ జరిగింది. కోదండ రామాలయం తెరిచేందుకు మంగళవారం ఉదయం అర్చకులు రాగా, గుడి తలుపులు, గర్భగుడి తలుపుల తాళం కప్పలు పగులకొట్టి ఉండటాన్ని గమనించి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పోలీసులకు సమాచారమిచ్చారు. నాలుగు వెండి కిరీటాలు, యజ్ఞోపవితం, బంగారపు ముక్కుపుడక, శఠగోపం, మంగళసూత్రాలు చోరీకి గురైనట్లు తెలిపారు. ఆభరణాల విలువ సుమారు రూ.3 లక్షలు విలువ ఉంటాయని తెలిపారు. ఘంటసాల ఎస్ఐ ప్రతాప్ రెడ్డి సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. మచిలీపట్నం నవీన్‌మిట్టల్ కాలనీకి చెందిన వేముల దశరథరాముడు వద్ద 11మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి.

సారా నిర్మూలనపై అవగాహన

సారా నిర్మూలన కోసం నవోదయం 2.0 కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. పోలాటితిప్పలో నాటుసారా నిర్మూలనపై ఎక్సైజ్ శాఖాధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఈఎస్ సి.భార్గవ, సీఐ లక్ష్మణ్, ఎస్ఐలు రామశేషయ్య, ఎం.రవి, కె.నాగరాజు, సర్పంచ్ మోకా రాజు పాల్గొన్నారు.

నగరంలో ఆక్రమణల తొలగింపు

అడ్డుకున్న వైసీపీ నాయకులు

మచిలీపట్నం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో మంగళవారం పలుచోట్ల డ్రైన్లపై ఆక్రమణలను మునిసిపల్ అధికారులు తొలగించారు. కాగా చింతచెట్టు సెంటర్ వద్ద ఒక వైసీపీ నాయకుడి బడ్డీ తొలగించేందుకు వచ్చిన సందర్భంలో వైసీపీ నాయకులు అడ్డుపడ్డారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్‌దాదా, పేర్ని కిట్టు, బొర్రా విఠల్, కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, తాతారావు, మాజీ జడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, చిటికిన నాగేశ్వరరావు, రఫీలు అడ్డుపడటంతో బడ్డీని తొలగించలేదు. కాగా మెయిన్‌రోడ్డులో డ్రెయిన్‌పైన ఉన్న పలు బడ్డీలను మునిసిపల్ అధికారులు తొలగించారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించే కార్యక్రమం కొనసాగుతోంది.



సీతారాములను దర్శించుకున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జోస్యులవారితోటలోని సీతారాముల విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా మంగళవారం రాత్రి గూడూరు మండలం శారదాయిపేటకు చెందిన సీతారామభక్త సమాజం కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను మైమరపించాయి. గూడవల్లి కృష్ణార్జునరావు, లక్ష్మీప్రసన్న భక్తిగీతాలకు బత్తిన నాగభూషణం కీ బోర్డుపై, గుడిసేవ రాధాకృష్ణ డోలక్‌పై సహకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గొర్రె హరిబాబు, ఉపాధ్యక్షుడు పుప్పాల శివకుమార్, సెక్రటరీ డి.వి. సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ పుప్పాల బాల అంజనేయ సూర్యప్రసాద్, కోశాధికారి కొలసాని శ్రీహరి పర్యవేక్షించారు. మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల బుల్లయ్య స్వామిని దర్శించుకున్నారు.

భక్తి శ్రద్ధలతో ఎదుర్కోలు సన్నాహం

గొడుగుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి స్వామి వారి ఎదుర్కోలు సన్నాహం జరిగింది. ఏవో గోపాలరావు పర్యవేక్షించారు.



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న రుత్వికులు

కనకదుర్గమ్మ ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠకు సన్నాహాలు

అవనిగడ్డ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో విగ్రహాల పునఃప్రతిష్ఠకు సంబంధించి వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో యాగశాల ఏర్పాటు చేసి హోమాలు, గణపతిపూజ నిర్వహించారు. నందివెలుగుకు చెందిన బాలాజీ గురుకుల్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను 12మంది రుత్వికుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మండలి వెంకట కృష్ణారావు (బాబు) పర్యవేక్షించారు.

నేటి నుంచి కల్యాణోత్సవాలు

గూడూరు : గూడూరు లక్ష్మీనృసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలు బుధవారం నుంచి 15 వరకు జరుగుతాయని ఆలయ ఈవో మోహనరావు తెలిపారు. 12న నుంచి విశేషపూజలు నిర్వహిస్తారని, 15న ధ్వజా అవరోహణ, పుష్పయాగోత్సవం, పూర్ణాహుతి జరపనున్నట్లు తెలిపారు.

శివరామకృష్ణ క్షేత్రానికి రూ.లక్ష విరాళం

కోడూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో పూర్తి గ్రానైట్‌తో పునర్ని ర్మాణం చేస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి కోట వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.1,01,116లు విరాళం ఇచ్చారు. మంగళవారం గ్రామానికి చెందిన కోట వెంకటేశ్వరరావు స్వగృహం వద్ద ఆలయ కమిటీ వారు ఈ విరాళాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్నం వెంకట సుబ్బారావు, బడే భావన్నారాయణ, జూపూడి సుభాష్ చంద్రబోస్, అన్నం శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అవనిగడ్డ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్‌టి.పి.కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8712625033కి ఫోన్ చేయాలని తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

నాగాయలంక: నాగాయలంక, అవనిగడ్డ, మోపిదేవి అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం నాగాయలంక జడ్పీ పాఠశాలలో పోషణ్ బీ - పడాయి బీపై శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమై 13 వరకు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారి టి.శేషకుమారి, మండల సూపర్‌వైజర్ ఎస్.నిర్మల పలు అంశాలపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.



ఆయిల్ ట్యాంకర్లను నిలిపి నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

'ఓఎన్‌జీసీ', 'మేఘా'లపై జనాగ్రహం

రహదారిపై ఆయిల్ ట్యాంకర్లను నిలిపి ఆందోళన

నాగాయలంక, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నంగేగడ్డ రెవెన్యూ పరిధిలోని వక్కపట్లవారిపాలెంలో ఉన్న ఓఎన్‌జీసీ, మేఘా సంస్థల యాజమాన్యం విధానాలను వ్యతిరేకిస్తూ వక్కపట్లవారిపాలెం, భావదేవరపల్లి గ్రామస్థులు మంగళవారం వక్కపట్లవారిపాలెం రిగ్ నుంచి తరలిస్తున్న ఆయిల్ ట్యాంకర్లను ప్రధాన రహదారిలో నిలిపి ఆందోళన చేశారు. దీంతో వాహనాల రాకపోకలు కాసేపు స్తంభించి పోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ, భారీ వాహనాలు తిరగటంతో నాగాయలంక, అవనిగడ్డలోని రోడ్లు అధ్వానంగా మా రాయన్నారు. ఆయిల్ నిక్షేపాలు వెలికితీత వల్ల వాయు కాలుష్యం, భూగర్భ జలాలు కలుషితమై, తాగునీరు నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కిలోమీటర్‌పైగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో సమా చారం అందుకున్న అవనిగడ్డ సీఐ యువకుమార్, నాగాయలంక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. సీఎస్ఆర్ నిధులు మంజూరైనట్టు తెలపడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

అంబటి బ్రాహ్మణయ్య కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలి

కోడూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని అంబటి బ్రాహ్మణయ్య కాలనీలో సీసీ రహదారులు నిర్మించాలని కోరుతూ ఆ కాలనీకి చెందిన ప్రజలు స్థానిక ఎంపీడీవో సుధా ప్రవీణ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వర్షం పడితే కాలనీలో నడవటానికి చాలా ఇబ్బందిగా ఉంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. కాలనీలోకి వెళ్లటానికి వంతెన శిథిలావస్థకు చేరుకుం దని వంతెన కూడా వెడల్పు పెంచాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో పామర్తి రాధాకృష్ణ, కోడూరు చిట్టమ్మ, బెల్లంకొండ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.